# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 128 | పేజీలు : 08 | శనివారం | 16-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.




## దుష్ప్రచారం ఆపండి

**బండి భగీరథ్ కేసులో బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి : సిటీ సివిల్ కోర్టు**

**బండి భగీరథ్ కేసులో బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపాలని ఆదేశాలు**

**తన పేరు వాడిన వీడియోలు తొలగించాలన్న బండి సంజయ్ పిటిషన్‌పై విచారణ**

**పత్రిక క్లిప్పింగ్‌లు, డిజిటల్ కంటెంట్ తొలగించాలని ఆదేశాలు**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

బండి సంజయ్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో ఊరట లభించింది. బండి భగీరథ్‌కు సంబంధించిన ఒక కేసు వ్యవహారంలో తనపై జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఈ వివాదంలో కేంద్ర మంత్రిని లక్ష్యంగా చేసుకుని ప్రసారం చేసిన అభ్యంతరకర కంటెంట్‌ను తక్షణమే తొలగించాలంటూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫోక్సోకేసు వ్యవహారంలో భవిష్యత్తులో ఎక్కడా తన పేరును వాడకుండా నిలువరించాలని బండి సంజయ్

### కుమారుడి కారణంగా

## తలవంపులు

**బండి సంజయ్ కిందిస్థాయి నుంచి వచ్చారు, కుమారుడి కారణంగా తలవంపులు: సీఎం రేవంత్ రెడ్డి**

**బండి భగీరథ్ పారిపోవడం తప్పన్న ముఖ్యమంత్రి**

**బండి సంజయ్ బాధ్యత తీసుకుని కుమారుడిని అప్పగించాలని సూచన**

**ఈ కేసులో ఎవరిది తప్పో విచారణలో తేలుతుందన్న రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కిందిస్థాయి నుంచి పైకి వచ్చారని, కుమారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసుపై ముఖ్యమంత్రి స్పందించారు. బండి భగీరథ్ పారిపోవడం తప్పని స్పష్టం చేశారు. బండి సంజయ్ బాధ్యత తీసుకుని తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలని సూచించారు.అలా చేస్తే బండి సంజయ్ గౌరవం మరింత పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని ఆయన అన్నారు. తప్పయినా, ఒప్పయినా మొదట నిలబడి సమాధానం చెప్పగలగాలని అన్నారు. తక్షణమే కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పో విచారణలో తేలుతుందని పేర్కొన్నారు.



### కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు,

## కానీ...!

**కవిత ఆసక్తికర వ్యాఖ్య**

**కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు దూరమయ్యారన్న కవిత**

**పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య**

**అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు.

### సోమ, శుక్రవారాల్లో

## ఆన్‌లైన్ విచారణలు

**సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు**

**ఇంధన పొదుపు చర్యలు చేపట్టిన సుప్రీంకోర్టు**

**ఇకపై వారంలో రెండు రోజులు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ**

**విచారణ లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని ఆదేశాలు జారీ**



హైదరాబాద్ పల్స్,డెస్క్

సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. ఆన్‌లైన్ విచారణ కోసం లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ సమయంలో సాంకేతిక అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది.ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు సీజేఐ

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా అక్కడ కాంగ్రెస్ అగ్రనేతలను కలవనున్నారు. అలాగే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కుమార్తె వివాహానికి కూడా సీఎం హాజరుకానున్నారు. ఇక ఈనెల 18న కేరళం ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్

## దొంగ ఓట్లతో గెలిచారు

**బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు: మహేష్ కుమార్ గౌడ్**

**ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహేష్ గౌడ్**

**గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ**

**బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య**





### భూగర్భ జలాల సంరక్షణకు

## పటిష్ఠ చర్యలు

**ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

భూగర్భ జలాల సంరక్షణకు, ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా భూగర్భంలో ఫ్లోరైడ్,

## ఐరాసలో సంస్కరణలు చేపట్టాలి

**భద్రతా మండలిని విస్తరించాలి: భారత్**

### ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు ఎప్పుడో జరగాల్సింది

### భద్రతా మండలిని కూడా విస్తరించాలి

### బ్రిక్స్ సదస్సులో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ పల్స్,డెస్క్

ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ పాలనా సంస్థల్లో అత్యవసర సంస్కరణలు చేపట్టాలని, బహుళపక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో 'ప్రపంచ పాలన, బహుళపక్ష వ్యవస్థ సంస్కరణలు' అనే అంశంపై సెషన్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన జైశంకర్, ఐక్యరాజ్యసమితి మరింత ప్రభావవంతంగా పనిచేయాలంటే, భద్రతా మండలిని విస్తరించడంతో పాటు, సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ స్థాయి సంస్థలు కాలం చెల్లిన నిబంధనలతో పనిచేస్తున్నాయని, అందువల్ల అంతర్జాతీయ ఆర్థిక,

## ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

**సంగారెడ్డిలో కేజేఎస్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీకి శంకుస్థాపన**

**పాల్గొన్న మంత్రి దామోదర, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**




హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడంపై ప్రత్యేకదృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా

## 'ఆత్మనిర్భర్'లో ఏపీ ముఖ్యపాత్ర

**పుట్టపర్తి ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగానూ మారనుంది: చంద్రబాబు**



హైదరాబాద్ పల్స్,అమరావతి

'అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. దేశం గర్వించే వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా పుట్టపర్తి మారనుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఏపీ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. దీనిని రాష్ట్రానికి కేటాయించినందుకు రాజ్‌నాథ్‌సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. 'ఇది రూ.15వేల కోట్లకుపైగా పెట్టుబడితో, 7500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రాజెక్టు.

# దుష్ప్రచారం ఆపండి

మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా సాగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని, ఇప్పటివరకు తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న వివాదాస్పద వీడియోలను, డిజిటల్ కంటెంట్‌ను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన తన పిటిషన్ ద్వారా కోర్టును కోరారు. బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు అదేశాలు జారీ చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలని కోర్టు ఆదేశించింది. బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకున్న వీడియోలు, పత్రిక క్లిప్పింగులు, డిజిటల్ కంటెంట్, వాల్ పోస్టర్లు ఈ నెల 26లోపు తొలగించాలని అదేశాలు ఇచ్చింది.

బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారంపై కేసు

మరోవైపు బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సోషల్ మీడియాలో ప్రసారంపై కేసు నమోదైంది. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదైంది. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు బాధితురాలి ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

బండి భగీరథ్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్య

బండి భగీరథ్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తనపైనా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని జస్టిస్ మాధవీ దేవి అన్నారు. తనను, తన భర్తను దుష్ప్రచారం చేస్తూ పోస్టులు పెట్టారని న్యాయమూర్తి తెలిపారు. ఇలాంటి పోస్టులు బాధాకరమని భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. దీనిపై పీపీ నాగేశ్వరరావు స్పందిస్తూ సోషల్ మీడియా పోస్టుల అంశాన్ని సీపీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

## కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు,

# కానీ...!

మొదటి పేజీ తరువాయి

అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

# దొంగ ఓట్లతో గెలిచారు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:

గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు దశలవారీగా చేపట్టాలి. బూత్ లెవల్ ఆఫీసర్లు జియో-ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడుసార్లు గృహ సందర్శన చేసి భౌతిక ధృవీకరణ చేయాలి. ఓటును తొలగించే ముందు ఏడు రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు తప్పనిసరిగా ఇవ్వాలి. అభ్యంతరాల స్వీకరణకు కనీసం నెల రోజులు గడువు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ పార్టీలకు 2002 మరియు 2025 నాటి ఓటర్ల జాబితాల సాఫ్ట్ మరియు హార్డ్ కాపీలను అందించాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ జాబితాలను సకాలంలో పార్టీలకు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 2002 తర్వాత రాష్ట్రానికి వలస వచ్చి, కనీసం రెండుసార్లు ఓటు వేసిన వారికి అఫిడవిట్ ప్రాతిపదికన ఓటు హక్కు కల్పించాలి. జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరు అధికారులు నిర్వహించాలి. ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదని కాంగ్రెస్ నేతలు కోరారు.



# ఐరాసలో సంస్కరణలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి

వాణిజ్య వ్యవస్థల పునర్నిర్మాణాన్ని భారత్ కోరుకుంటోందని ఆయన అన్నారు. ఈ సమావేశం తర్వాత జైశంకర్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. అందులో పరస్పరం అనుసంధానమైన నేటి బహుళ-ధృవ ప్రపంచంలో 'నమ్మకమైన, సంస్కరణలతో కూడిన బహుళపక్ష విధానం' అత్యవసరం అని, బ్రిక్స్ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చించామని అన్నారు.

ఇక ఐరాస సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రాత పూర్వక చర్చలు (టెక్ట్స్ బేస్డ్ నెగోసియేషన్స్) తక్షణమే ప్రారంభం కావాలని జైశంకర్ పేర్కొన్నారు. అలాగే బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను మరింత బాధ్యతాయుతంగా, మరింత బలంగా మార్చాలన్నారు. ఇందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిర్మాణంలో అత్యవసర మార్పులు అవసరమని పేర్కొన్నారు. అలాగే వాతావరణ నిధులు (క్లైమేట్ ఫైనాన్స్), అభివృద్ధి నిధుల లభ్యతను పెంచాలని జైశంకర్? కోరారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) కేంద్రంగా పనిచేసే 'నిబంధనలకు కట్టుబడి, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, అందరినీ కలుపుకుపోయే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ' ఉండాలని అన్నారు.

అరాగ్చీతో చర్చలు

బ్రిక్స్ సమావేశాల మధ్యలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అరాగ్చీ మాట్లాడుతూ, భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సభ్య దేశాల మధ్య మరింత సమన్వయం, విజయాలు సాధించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాతో జరిగిన యుద్ధం, కాల్పుల విరమణ పరిస్థితులు, వివాదాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల వివరాలను ఆయన జైశంకర్ కు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు హర్మూజ్ జలసంధిలోని తాజా పరిణామాలు, సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వంపై తమతమ అభిప్రాయాలు పంచుకున్నారు.

ఇరాన్‌తో స్నేహం

ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వివాదాలకు దౌత్యపరమైన పరిష్కారాలు కనుగొనాలని, వాటికే భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. భారత్-ఇరాన్ మధ్య ఎప్పుడూ స్నేహపూర్వక సంబంధాలు ఉంటాయని పేర్కొన్నారు.

ద్వంద్వ విధానాలపై ఇరాన్ ఆగ్రహం

బ్రిక్స్ సమావేశం రెండో రోజున ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ, ఇరాన్‌లోని పౌరులపై, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. పౌరులపై దాడులను అంతర్జాతీయ సమాజం ఖండించాలని, ద్వంద్వ విధానాలను వీడాలని ఆయన కోరారు. 'మినాబ్ లో ఒక చిన్నారి ప్రాణం కూడా, ప్రపంచంలో మరెక్కడైనా ఉండే చిన్నారి ప్రాణంతో సమానమని నిరూపించాలి' అని అన్నారు. ఐరాస భద్రతా మండలి సంస్కరణ అనేది ఒక ఐచ్ఛికం కాదు, అది ఐరాస మనుగడకే అత్యంత అవసరమని అరాగ్చీ స్పష్టం చేశారు. "ప్రపంచంలోని అన్ని ఖండాలు, ప్రాంతాలకు నిజమైన ప్రాతినిధ్యం వహించే కౌన్సిల్ మాకు కావాలి. అధికారం కేవలం కొద్ది మంది దుర్వినియోగ, దురాక్రమణ శక్తుల ప్రయోజనాల కోసమే కాకుండా, బాధ్యతాయుతంగా, సమానంగా పంపిణీ చేయబడే మండలి మాకు కావాలి" అని ఆయన అన్నారు. ఈ నిజమైన బహుళపక్ష విధానానికి బ్రిక్స్ కూటమి ఒక వెన్నెముకగా మారగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

ప్రమాణ స్వీకారానికి కూడా ఆయన హాజరయ్యే అవకాశాలున్నాయి. మరోవైపు.. పొదుపు చర్యల్లో భాగంగా సీఎం రేవంత్ తన కాన్వాయ్‌ను నాలుగు వాహనాలకు తగ్గించుకున్నారు. శుక్రవారం పలుచోట్ల కార్యక్రమాలకు హాజరైన ఆయన నాలుగు వాహనాల కాన్వాయ్‌తో ప్రయాణం చేశారు.

# 'ఆత్మనిర్భర్'లో ఏపీ ముఖ్యపాత్ర

మొదటి పేజీ తరువాయి

ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి మారుతుంది. అత్యంత వేగంగా ఈ ప్రాజెక్టును సాకారం చేయడానికి రక్షణ శాఖ, కేంద్రం సహకారం అందించాయి. జెట్ స్పీడ్‌తో అనుమతులిచ్చాం. 36 రోజుల్లోనే శంకుస్థాపన చేశాం. ఏరోస్పేస్ రంగంలో ఒ కీలక ప్రాజెక్టుతో పాటు మరికొన్ని డిఫెన్సు ప్రాజెక్టులు కూడా ఇక్కడకు వస్తాయి' అని తెలిపారు. కర్నూలు (ఓర్లకల్లు) డ్రోన్ సిటీలో శంకుస్థాపనలు చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం యుద్ధాల్లో డ్రోన్లే కీలకంగా మారాయని గుర్తుచేశారు. శ్రీహరికోట అంతరిక్షశక్తి, నాగాయలంకలో క్షిపణి శక్తి, పుట్టపర్తిలో రక్షణ శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తితో ఏపీ దేశానికి అండగా నిలుస్తోందన్నారు.

కరువుసీమలో పరిస్థితులు మార్చాం..

'గతంలో రాయలసీమ రతనాల సీమ.. కానీ వివిధ కారణాలతో కరువుసీమగా మారిపోయింది.. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆ పరిస్థితిని మార్చాం' అని సీఎం తెలిపారు. రాయలసీమలో ప్రతి ఎకరానికీ నీరిచ్చేలా కార్యాచరణ చేపట్టామన్నారు. 'ఇక్కడి ఇనుపఖనిజం, సున్నపు రాయి తదితరసహజ వనరులను సమర్థంగా వినియోగించుకుంటాం. కడప స్టీల్ ప్లాంటు పనులను జూన్‌లో ప్రారంభిస్తాం. 2027 డిసెంబరునాటికి పూర్తి చేస్తాం. స్టీల్, సిమెంట్ ప్లాంట్లు, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సీమ కేంద్రంగా మారుతుంది. డిఫెన్స్, స్పేస్, ఏరోస్పేస్, ఎలక్ట్?ట్రనిక్స్ తదితర పరిశ్రమలతో రతనాల సీమగా మారుస్తాం. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్, శ్రీహరికోట సమీపంలో స్పేస్ సిటీ ఏర్పాటు చేస్తాం' అని చెప్పారు. 'గతంలో గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు గోల్డ్ అంటే జేజీఎ?ఫ-జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ కర్నూలులో వస్తోంది. జేజీఎఫ్ లో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి అవుతుంది. రెండో ఏడాది 1500 కిలోల బంగారం తయారవుతుంది. రానున్న రోజుల్లో బంగారం ఉత్పత్తికి ఏపీ కీలకంగా మారుతుంది' అని చెప్పారు.

గత పాలనంతా విధ్వంసమే..

గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని చంద్రబాబు విమర్శించారు. 'సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించాం. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. తద్వారా 24 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. యువతకు ఇక్కడే ఉద్యోగాలు రావాలి. ఇతరులకూ మనమే ఉపాధి కల్పించేలా పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ తదితర ప్రాజెక్టులు వచ్చాయి. రిలయన్స్, బీపీసీఎల్ మొదలైనవి కూడా వస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లలో పెట్టుబడులు వస్తాయి. చిప్ నుంచి షిప్ వరకూ మన దేశంలోనే తయారు కావాలని ప్రధాని పిలుపిచ్చారు. ఏపీలో డిజైన్ చేయండి.. పెట్టుబడులు పెట్టండి.. తయారు చేయాలని నేను కోరుతున్నాను' అని తెలిపారు.

## సోమ, శుక్రవారాల్లో

# ఆన్‌లైన్ విచారణలు

మొదటి పేజీ తరువాయి

సహా ఇతర న్యాయమూర్తులు కార్ పూలింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రిజిస్ట్రీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతం మందికి వారంలో రెండ్రోజుల పాటు వర్క్ ఫ్రం హోం విధానాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇందుకోసం వీక్లీ రోస్టర్‌ను తయారు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇళ్ల నుంచి పనిచేసే వారు ఎల్లప్పుడూ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండాలని, అవసరమైతే వెంటనే కార్యాలయానికి రావాల్సి ఉంటుందని తెలిపింది. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా నిర్ధారించుకోవాలని రిజిస్ట్రీకి సూచించింది. అయితే, వర్క్? ఫ్రం హోమ్ సమర్థవంతంగా లేదని సంబంధిత రిజిస్ట్రార్ అభిప్రాయపడితే, ఆయా శాఖ లేదా విభాగానికి అటువంటి ఏర్పాట్లను పరిమితం చేయవచ్చు లేదా సవరించవచ్చునని సర్క్యులర్?లో పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్యలు చేపట్టింది.

ఇంధన సంక్షోభంపై మోదీ సూచనలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో భవిష్యత్?లో దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ఇంధనం పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్?కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఏడాది పాటు బంగారం కొనవద్దని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. చిన్న చిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చునని అన్నారు.

ప్రధాని పిలుపునకు విశేష స్పందన

అయితే, ప్రధాని మోదీ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నారు. తాజాగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రజా రవాణాకు ప్రాధాన్యమిచ్చి, కాన్వాయ్‌ని వాడకుండా రైలులో ప్రయాణించి కురుక్షేత్రకు వెళ్లారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ తొక్కుతూ గురుకుల్ చేరుకున్నారు. ఆయన భద్రతా సిబ్బంది సైతం సైకిల్‌పైనే గవర్నర్‌ను అనుసరిస్తూ తమ విధులను నిర్వర్తించారు.

దిల్లీలో వర్క్? ఫ్రం హోమ్

మరోవైపు, దిల్లీ ప్రభుత్వం కూడా ఇప్పటికే అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది. సీఎం, మంత్రుల కాన్వాయ్‌ని సగానికిపైగా తగ్గించింది. మరోవైపు, ఇంధన ధరల పెంపుపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్?పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశాయి. అయితే, ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయని ముందుగానే ఊహించామని తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది.

## భూగర్భ జలాల సంరక్షణకు

# పటిష్ఠ చర్యలు

మొదటి పేజీ తరువాయి

నైట్రేట్ వంటి లవణాలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. శుక్రవారం సచివాలయంలో భూగర్భ జలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ అత్యంత ప్రాధాన్యమైన అంశమని, ఈ విషయంలో రైతులకు ప్రత్యేకంగా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి సమర్థ వినియోగానికి, వృథాగా పోయే నీటిని నియత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 2024తో పోల్చితే 2025లో భూగర్భ జలాల వినియోగం 45.93 శాతం నుంచి 46.86 శాతానికి పెరిగిన విషయాన్ని ప్రస్తావించారు. భూగర్భ జలాల సంరక్షణను ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలన్నారు. జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు అమలులో ఉత్తమ పనితీరు కనబర్చిన శాఖల్లో తెలంగాణ గ్రౌండ్ వాటర్ విభాగం ఒకటిగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఇకపై భూగర్భ జలాల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కృత్రిమ మేధను ఉపయోగించాలన్నారు. జిల్లా కలెక్టర్లు భూగర్భ జలాల వినియోగం, రీచార్జ్ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు. భూగర్భ జలాల అధిక వినియోగ ప్రాంతాలుగా గుర్తించిన గ్రామాల్లో కొత్త బోర్‌వెల్ తవ్వకాలను నియంత్రించాలని మంత్రి ఆదేశించారు. 16 జిల్లాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి అధికంగా ఉందని, హైదరాబాద్ జిల్లాలోనే 8 మండలాలు అధిక వినియోగ కేటగిరిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇసుక తవ్వకాల అనుమతులకు ముందు భూగర్భ జలాల శాఖతో సంప్రదించాల్సిన అవసరంపెనా చర్చించారు. భూగర్భ జలాలు పెంచడానికి భూగర్భ జల శాఖ, నీటిపారుదల, పంచాయతీరాజ్, పరిశ్రమల శాఖల మధ్య మరింత సమన్వయం ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ హబ్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో రూ.650 కోట్లతో నిర్మించనున్న కేజేఎస్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకు శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేశారు. 44 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పనున్న ఈ పరిశ్రమ ద్వారా 1500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా.. ఇందులో సుమారు వెయ్యి మంది మహిళలు ఉండడం అభినందనీయమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పారిశ్రామిక రంగాన్ని ముందుచూపుతో పరుగులు తీయిస్తున్నారని, హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు అవతల వ్యవసాయా?ధారిత పరిశ్రమలను నెలకొల్పేలా చర్యలు చేపట్టారని వివరించారు. అనంతరం దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంగారెడ్డి ప్రాంతంలో భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చిన కేజేఎస్ ఇండియా యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ప్రసంగిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారం వల్లనే ఈ పరిశ్రమ సాకారమైందన్నారు. ఈ కార్యక్రమంలో కేజేఎస్ ఇండియా చైర్మన్ గిరీష్ జైన్, ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్యకు సర్వం సిద్ధం..!

**- సర్వాంగ సుందరంగా దత్తక్షేత్రం**
**- వేసవి దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి**
**- ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అల్లాడి వీరేశం**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, జహీరాబాద్ : సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలో ఉన్న శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలోని శ్రీ శనీశ్వర స్వామి దేవాలయం శని అమావాస్య, శని జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. శని అమావాస్య సందర్భంగా భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆశ్రమం పీఠాధిపతులు అవధూత గిరి, సిద్దేశ్వరానందగిరి, ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం తెలిపారు. వేసవి తీవ్రతను పరిగణనలోకి తీసుకొని తాగునీరు, నీడ ఏర్పాట్లు, క్యూలైన్ నిర్వహణ వంటి



సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా శనేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, నవగ్రహారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శని అమావాస్య అనేది శనివారం అమావాస్య తిథి కలిసివచ్చే పవిత్ర దినంగా భావిస్తారు. ఈ రోజున శనేశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే శని దోషాలు నివారించి, కష్టాలు తొలగి, శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపాశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# బైక్ దొంగతనానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్ చేసిన రాయికోడ్ పోలీసులు

**1 బైక్, 2 ఆటో రిక్షాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలింపు.**
**రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, రాయికోడ్ : వివరాలలోకి వెళితే, ఈ నెల మే 9వ తేదీన సంగాపూర్ గ్రామానికి చెందిన కాపాడి సుమన్ గౌడ్ తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్ సీసీటీవీ కెమెరాలు మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితుడి వద్ద నుండి 1 బైక్ మరియు 2 ఆటో రిక్షాలను స్వాధీనం చేసుకొని, అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన పండరి గౌడ్‌గా గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఏటీఎం చోరీ కేసు, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ కేసు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలయ చోరీ కేసులతో పాటు మరికొన్ని కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. ఈ కేసును




ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు

# ములకలపల్లిలో సీతారామ ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం

**రైతులను తప్పుదోవ పట్టించే కుట్రలు సహించం**
**అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నాం : సర్పంచ్ డీఎస్ కళావతి జగదీష్**



హైదరాబాద్ పల్స్, మే 15, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామంలో మండలంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఖండిస్తూ ములకలపల్లి గ్రామ సర్పంచ్ డీఎస్ కళావతి జగదీష్ శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. ములకలపల్లి గ్రామంలో ఎలాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు లేవని కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టులు, సందేశాల కారణంగా ములకలపల్లి గ్రామంతో పాటు అందనాలపాడు, మోదుగుగడ్డ తదితర గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఇప్పటికే సాగునీటి కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతులు ఈ ప్రచారంతో అయోమయంలో పడిపోయారని పేర్కొన్నారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో సంబంధిత ఇరిగేషన్ అధికారులతో స్వయంగా మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నానని సర్పంచ్ కళావతి జగదీష్ చెప్పారు అధికారుల సమాచారం ప్రకారం సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలో కమలాపురం పంప్ హౌస్ నిర్మాణ పనులతో పాటు వీ.కే. రామవరం ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేసినట్లు వెల్లడించారు. అయితే కొంతమంది వ్యక్తులు రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాల కోసం కావాలనే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాలతో రైతుల్లో భయం, అనుమానాలు పెంచడమే కాకుండా గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలిగించే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తప్పుడు ప్రచారం వల్ల గ్రామ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు తగ్గే ప్రమాదం కూడా ఉందని సర్పంచ్ హెచ్చరించారు. ప్రాజెక్టు వస్తే భూముల విలువలు పెరిగే పరిస్థితి ఉండగా, కావాలనే తప్పుడు వార్తలు ప్రచారం చేసి రైతులను నష్టపరిచే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. రైతుల ఆశలు, భవిష్యత్తు, గ్రామాల అభివృద్ధితో ముడిపడిన అంశాలపై నిరాధార ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగానే స్పందించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమం కోసం గ్రామ ప్రజలు ఐక్యంగా నిలవాలని, తప్పుడు ప్రచారాలను సమిష్టిగా తిప్పికొట్టాలని ములకలపల్లి గ్రామ సర్పంచ్ డీఎస్ కళావతి జగదీష్ పిలుపునిచ్చారు.

# విద్యానగర్ లో అగని బహులా అంతస్తుల అక్రమ నిర్మాణాలు

**నోటీసులు అందుకున్న ఆగని అక్రమ నిర్మాణాలు**
**2018 పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకునేది ఎవరు ?**
**గిరిజన చట్టాలను లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు**
**ఆక్రమ నిర్మాణాలకు పార్కింగ్ ప్లేసులు వుండవు రోడ్ల మీదనే వాహనాలు**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచయతీ పరిధిలో అనేక బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. గతంలో అనేక అక్రమ నిర్మాణాలపై దినపత్రిక లో ఎన్నో కథనాలు ప్రచురించాయి . అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలంటూ పలుమార్లు విద్యానగర్ సెక్రటరీ నుండి నోటీసులు అందుకున్న అక్రమ నిర్మాణదారులు. నోటీసులు అందుకుంటాం కానీ అక్రమ నిర్మాణాలు ఆపమన్నట్టుగా నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారికి 2018 పంచాయతీరాజ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే బాగుంటుంది. నోటీసులు జారీ చేసే క్రమంలో 2018 పంచాయతీ రాజ్ చట్ట ప్రకారం నిర్మాణాలు నిలుపుదల చేయకపోతే కఠిన చర్యలు అంటున్నారు తప్ప తీసుకోవడం లేదు. వారు ఎలాగూ చర్యలు తీసుకోలేరు మా పని మేము చేసుకుంటామంటూ అక్రమ నిర్మాణదారులు బరితెగించి నిర్మాణాలు చేస్తున్నారు 1/70 యాక్టులో నిర్మాణాలు చేపట్టవచ్చా చేపడితే గిరిజన చట్టాలు వారికి వర్తిస్తాయా లేక పంచాయతీ అధికారులు సిబ్బంది గిరిజన చట్టాలను తుంగలో తొక్కుత్నరీ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారా? ఇవన్నీ తెలిసిన అధికారులు మౌనంగా ఉండడం వెనుక ఆంతర్యం ఏమిటా అని బహువటంగానే చర్చించుకుంటున్న ప్రజలు . ప్రజాప్రతినిధులు ఉన్నా లేనట్టుగానే ఉన్నది. మరి వారైనా ఇటువంటి అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేస్తారా లేదా అన్నది చూడాల్సిందే ఏది ఏమైనా విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు సైతం నిర్మిస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహమే లేదు.. ఇలా అక్రమ నిర్మాణాలు జి ప్లస్ త్రీ నిర్మాణాలు నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు కనీసం పార్కింగ్ సౌకర్యం కూడా లేకుండా నిర్మాణాలు చేస్తుండడం నిర్మాణాలు పూర్తయిన తర్వాత పార్కింగ్ ప్లేస్ ఉండక రోడ్ల మీదనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది దీనితో అనేక ఆక్సిడెంట్లు జరుగుతున్నాయి ఎన్ని రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు చేసినప్పటికీ అనుమతులు లేని వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ ప్లేస్ లేక రోడ్ల మీదనే వాహనాలు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అనార్థాలు జరగకుండా ఉండాలంటే ముందుగానే ఇటువంటి అనుమతులు లేని అక్రమ నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఆకులు కాలాక చేతులు పట్టుకుంటే ఏం లాభం అన్నట్టుగా పార్కింగ్ స్థలాలు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు నిర్మించకుండా ముందస్తుగానే కఠిన చర్యలు అధికారులు తీసుకుంటే ఈటువంటి ప్రమాదాలను నివారించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కావున అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను జి ప్లస్ త్రీ నిర్మాణాలను సైతం నిలుపుదల చేసి వారికి అండగా నిలిచే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు.



# సంగారెడ్డిలో టీజీఐఐసీ కార్యాలయం ప్రారంభోత్సవం

**హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ**




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే15, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:
సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ నగర్ లో టీజీఐఐసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డిని నూతన కార్యాలయంలోని కుర్చీలో కూర్చోబెట్టారు. మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు.

# అగ్ని ప్రమాద బాధితులకు అండగా శ్రీ శివ నాగ స్వామి

**నిరుపేదలకు సేవ చేయడమే నా ఆశయం**



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి కొత్తగూడెం :
చర్ల మండలం సింగసముద్రంలో తెల్లవారుజాము సమయంలో ఇర్పా. దర్మరాజు అనే వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో నిప్పు అంటుకొని ఇల్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. వీరు పూర్తిగా నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా కుటుంబం నష్టపోవడం జరిగిందని స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం చిన్నఅరుణాచలం వ్యవస్థాపకులు అరుణాచలేశ్వర ట్రస్ట్ తరపున శ్రీ శివనాగు స్వామి 50 కేజీల బియ్యం, దుస్తులు కూరగాయలు 4000 విలువచేసే వస్తువుల్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రెండు మండలాల్లో నిరుపేదలకు ఏ కష్టం వచ్చినా సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీ శివ నాగ స్వామిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నూతన ఆచార్యులు నవీన్ రెడ్డి.చర్ల వాస్తవ్యులు వీర్రాజు, దేవయ్య పాల్గొన్నారు.

# చిన్నారుల మరణాలపై చిల్ట్ డెత్ రివ్యూ కార్యక్రమం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు, జిల్లా చైల్డ్ హెల్త్ అండ్ ఇమ్యూనిజేషన్ అధికారి డా ప్రతాప్ సమక్షంలో ఈ రోజు జిల్లా డి యం ఎచ్ ఓ కార్యాలయంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన చిన్నారుల మరణాలపై చిల్ట్ డెత్ రివ్యూ కార్యక్రమం నిర్వహించబడింది. సమావేశంలో చిన్నారుల మరణాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించి, మరణాలకు దారితీసిన కారణాలపై విచారణ చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి మరణాలను నివారించేందుకు అవసరమైన చర్యలపై వైద్య అధికారులకు సూచనలు అందజేయబడినవి. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ మాతృ శిశు మరణాలను నివారించేందుకు ఆరోగ్య సిబ్బంది అందరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అలాగే గర్భిణీలు బాలింతలకు ప్రసవం అనంతరం పిల్లలు రెండు సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు నిరంతర ఆరోగ్య విద్య, పోషకాహార సూచనలు వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, సి హెచ్ ఓ నాగభూషణం ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ ఘటనలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ వెంకన్న

**నర్సింహులపేట మండల ప్రజలకు పోలీసుల హెచ్చరిక**




హైదరాబాద్ పల్స్, మే 15, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న చైన్ స్నాచింగ్ ఘటనల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా నర్సహులపేట మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ వెంకన్న విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసవికాలం కారణంగా చాలామంది ప్రజలు ఆరుబయట నిద్రిస్తున్న పరిస్థితిని నేరస్తులు అవకాశంగా మార్చుకునే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. భద్రత దృష్ట్యా ఎవరూ ఇళ్ల బయట నిద్రించవద్దని, ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించి రాత్రివేళల్లో ఒంటరిగా తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అలాగే గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు భద్రతపై చైతన్యం కల్పించాలని ఎస్ఐ వెంకన్న సూచించారు. ప్రతి గ్రామంలో రాత్రి పహారా వ్యవస్థను బలోపేతం చేసి, గ్రామస్తులు పరస్పరం సహకారంతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

# యాదాద్రి భువనగిరిలో డ్రగ్స్ కలకలం.. కాలేజీలో బ్రౌన్ షుగర్ అమ్మేందుకు యత్నం.. ఇద్దరు అరెస్ట్




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15,యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లాలో డ్రగ్స్ కలకలం రేపింది. భువనగిరి పట్టణంలోని ఓ జూనియర్ కాలేజీలో డ్రగ్స్ అమ్మేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాలేజీ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీ చేసిన పోలీసులు వారి దగ్గర డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. భువనగిరి పట్టణంలోని ఓ జూనియర్ కాలేజీ ఆవరణలో డ్రగ్స్ అమ్మేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను శుక్రవారం (మే15, 2026) పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ కు చెందిన హబీబ్ బుర్రన్ రెహ్మాన్, ఖదీర్ అనే ఇద్దరు యువకులు కాలేజీలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 50 గ్రాముల బ్రౌన్ షుగర్ పట్టుబడటంతో కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్ కు తరలించారు. కాలేజీ ఆవరణలో డ్రగ్స్ కలకలంతో విద్యార్థులు, కాలేజీ స్టాఫ్ ఒక్కసారిగా ఉలిక్కపడ్డారు.

# కొండపై వర్తక సంఘం రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అంజేసిన యాదాద్రి పరిరక్షణ కమిటీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండపై కొనసాగుతున్న వర్తక సంఘాన్ని రద్దు చేసి దుకాణాలకు బహిరంగ టెండర్లు నిర్వహించాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వర్తక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 10 దుకాణాల ద్వారా సంవత్సరానికి కేవలం రూ.1.68 కోట్లు మాత్రమే దేవస్థానానికి ఆదాయం వస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. అదే టెండర్ల ద్వారా కేటాయిస్తే రూ.20 నుంచి రూ.30 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈనెల 31తో దుకాణాల గడువు ముగియనున్న నేపథ్యంలో వెంటనే టెండర్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. కొండకింద అన్నదానం కాంప్లెక్స్ వద్ద ఉన్న 112 షాపింగ్ కాంప్లెక్స్‌లకు కూడా టెండర్లు నిర్వహిస్తే దేవస్థానానికి ఆదాయం పెరగడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కొందరే ఏళ్ల తరబడి దుకాణాలను కొనసాగించడం వల్ల దేవస్థాన ఆదాయానికి నష్టం జరుగుతోందని ఆరోపించారు. దేవస్థాన అభివృద్ధి, భక్తుల సౌకర్యాల పెంపు కోసం పారదర్శక టెండర్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, బండ రామస్వామి, దండబోయిన వీరేష్, బండి వాసు, కర్రె ప్రవీణ్, బండి అనిల్, కొన్నె సంజీవ, గుండ్లపల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా రాష్ట్రంలో మగవారిలో ఆ సమస్య.. షాకింగ్ రిపోర్ట్!




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, మెయిన్ డెస్క్ :
తెలంగాణలో మగవారి ఆరోగ్యానికి సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రముఖ హెయిర్ కేర్ బ్రాండ్ 'త్రాయ హెల్త్' నిర్వహించిన 'జాతీయ గట్-హెయిర్ హెల్త్ సర్వే'లో పురుషుల ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనకర వాస్తవాలు బయటపడ్డాయి. మగవారిలో జుట్టు ఊడిపోవటం, జీర్ణ సంబంధిత ఆరోగ్యం పైన అధ్యయనం చేసిన సంస్థ షాకింగ్ విషయాలను వెల్లడించింది .

**మలబద్ధకం స్థాయి ప్రధాన సూచికగా గట్ హెల్త్ అంచనా:**
దేశవ్యాప్తంగా 1.6 లక్షల మంది పురుషులపై 2024 డిసెంబర్ నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో ఈ అధ్యయనం జరిగింది. మలబద్ధకం స్థాయిని ప్రధాన సూచికగా తీసుకొని గట్ హెల్త్‌ను అంచనా వేశారు. 2024లో ఆరోగ్యకర జీర్ణక్రియ (తక్కువ లేదా మలబద్ధకం లేని వారు) ఉన్నవారి శాతం 19.13%గా ఉంది. 2025లో 15.03%గా ఉన్న ఈ గట్ హెల్త్, ఏడాదిలోనే 4.10 శాతం తగ్గుదల నమోదైంది.

**గట్ హెల్త్ సమస్యలో తెలంగాణది మొదటి స్థానం**
తెలంగాణలో మగవారిలో జీర్ణ సంబంధిత ఆరోగ్యం గట్ హెల్త్ వేగంగా తగ్గుతోందని, దీని ప్రభావంతో జుట్టు రాలడం (హెయిర్ ఫాల్) సమస్య దేశంలోనే ఇక్కడే ఎక్కువగా నమోదవుతోందని తాజా సర్వే వెల్లడించింది. మలబద్ధకం స్థాయిని ప్రధాన సూచికగా తీసుకొని చేసిన సర్వేలో దేశంలోని 10 ప్రధాన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. రాజస్థాన్ (-3.3%), ఢిల్లీ (-2.97%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**గట్ హెల్త్ సమస్యతో హెయిర్ ఫాల్ :**
జీర్ణ సమస్యలు పెరగడం వల్ల శరీరం పోషకాలను సరిగా గ్రహించలేకపోవడం, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలు ఏర్పడి జుట్టు రాలడం పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్, ఒత్తిడి, అనియమిత భోజనాలు, నిద్రలేమి వంటి ఆధునిక జీవన విధానాలు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా చెప్పుతున్నారు.

**నిపుణుల సూచనలు:**
ఫైబర్ అధికంగా ఉండే ఆహారం కూరగాయలు, పండ్లు, ధాన్యాలు తీసుకోవటం, నీళ్లు సరిపడాతాగటం, రెగ్యులర్ వ్యాయామం, సమయానికి నిద్ర అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు .ఒత్తిడిని నియంత్రించాలని చెప్పారు. తెలంగాణ యువతలో ఈ సమస్యలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య స్పృహ పెంపొందించాలని వైద్యులు సూచిస్తున్నారు. గట్ హెల్త్ మెరుగుపరచడం ద్వారా హెయిర్ ఫాల్ సమస్యను కూడా ఎక్కువగా అదుపు చేయవచ్చని ఈ సర్వే సూచిస్తోంది.

# సీబీఐకి దొరికిన నీట్ పేపర్ లీక్ 'మాస్టర్ మైండ్'.. ప్రొఫెసర్ అరెస్ట్..!



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, సెంట్రల్ డెస్క్:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కీలక ముందడుగు వేసింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పుణెకు చెందిన ప్రముఖ కెమిస్ట్రీ లెక్చరర్ పి.వి. కులకర్ణిని సీబీఐ అరెస్టు చేసింది. గత మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ వివాదం కారణంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చివరకు పరీక్షను రద్దు చేయాల్సి వచ్చింది.సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాలు దేశాన్ని షాక్‌కు గురిచేస్తున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం, కులకర్ణి గత కొన్ని సంవత్సరాలుగా నీట్ ప్రశ్నపత్రాల తయారీకి సంబంధించిన ప్యానెల్‌లో సభ్యుడిగా పనిచేసినట్లు గుర్తించారు. ఎన్‌టీఏతో ఉన్న అనుబంధం కారణంగా ప్రశ్నపత్రాలకు ముందస్తు ప్రాప్యత అతనికి లభించినట్లు అధికారులు చెబుతున్నారు. పదవీ విరమణ చేసిన కాలేజీ ప్రొఫెసర్ అయిన ఆయన.. తన అనుభవం, పరిచయాలను ఉపయోగించి ఈ భారీ అక్రమానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**దర్యాప్తు ప్రకారం :**
ఏప్రిల్ చివరి వారంలో పుణెలోని తన నివాసంలో కులకర్ణి రహస్య ట్యూషన్ తరగతులను నిర్వహించాడు. ఈ ప్రత్యేక సెషన్లలో పాల్గొన్న విద్యార్థులకు అసలు నీట్ ప్రశ్నలు, వాటి సరైన సమాధానాలను ఎంపికలతో సహా వివరించినట్లు సీబీఐ వెల్లడించింది. విద్యార్థులు ఆ ప్రశ్నలను తమ నోట్‌బుక్‌లలో చేతితో రాసుకున్నారని, తర్వాత మే 3న జరిగిన అసలు పరీక్షలో అవే ప్రశ్నలు రావడంతో లీకేజీ నిర్ధారణ అయ్యిందని అధికారులు తెలిపారు.ఈ వ్యవహారంలో మరో కీలక నిందితురాలిగా ఉన్న మనీషా వాఘ్మారేను కూడా సీబీఐ అదుపులోకి తీసుకుంది. ఆమె విద్యార్థులను సమీకరించడం, డబ్బుల లావాదేవీలను నిర్వహించడం వంటి బాధ్యతలు చూసినట్లు అనుమానిస్తున్నారు. ఈ రహస్య కోచింగ్ సెషన్‌లో పాల్గొనడానికి విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు విచారణలో బయటపడింది.

**సీబీఐ ప్రకటన ప్రకారం :**
ఈ కేసు ఇప్పటివరకు నీట్ లీకేజీ వెనుక ఉన్న అసలు మూలాన్ని బయటపెట్టింది. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేసిన అధికారులు, మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తూ, డిజిటల్ పరికరాలు, నోట్‌బుక్‌లు, చాట్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు.మే 3న నిర్వహించిన నీట్-యూజీ 2026 పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వైద్య విద్యలో ప్రవేశాలకు కీలకమైన ఈ పరీక్షలో అక్రమాలు వెలుగులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజస్థాన్‌లో మొదట వెలుగులోకి వచ్చిన 'గెస్ పేపర్' వ్యవహారం తర్వాత ఈ వివాదం మరింత ముదిరింది.రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ) ప్రారంభించిన దర్యాప్తులో, కొందరు విద్యార్థుల వద్ద లభించిన చేతిరాత ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలినట్లు గుర్తించారు. బయాలజీలోని 90 ప్రశ్నలు, కెమిస్ట్రీలోని 45 ప్రశ్నలు సహా మొత్తం 281 ప్రశ్నలు ఉన్న ఒక 'గెస్ పేపర్' బయటపడింది. ఈ ప్రశ్నల్లో అనేకవి అసలు పరీక్షలో రావడంతో అనుమానాలు బలపడ్డాయి.వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఎన్‌టీఏ తొలుత పరీక్ష భద్రతపై నమ్మకం వ్యక్తం చేసినప్పటికీ, తర్వాత పరిస్థితి అదుపు తప్పడంతో పరీక్షను రద్దు చేసింది. మే 12న అధికారికంగా రద్దు ప్రకటన వెలువడగా, లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్షకు సిద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ ఘటన దేశంలో పోటీ పరీక్షల భద్రతపై మరోసారి తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తింది. ప్రశ్నపత్రాల లీకేజీ, కోచింగ్ మాఫియాల పెరుగుదల, పరీక్షా వ్యవస్థలో అంతర్గత అవినీతి వంటి అంశాలు ఇప్పుడు జాతీయస్థాయిలో చర్చకు దారితీశాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

# ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శిగా కోటమర్తి శ్రీనివాస్ రెండవసారి ఎన్నిక



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ ప్రజానాట్యమండలి నాలుగవ మహాసభలు పాల్వంచలో చంద్ర రాజేశ్వరరావు భవన్లో 14వ తేదీన జరిగినాయి. ఈ జిల్లా మహాసభల్లో బూర్గంపహాడ్ మండలం సారపాక రాజీవ్ నగర్ కి చెందిన కోటమర్తి శ్రీనివాస్ ను రెండవసారి సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. కోటమర్తి శ్రీనివాస్ జిల్లా స్థాయి పాటలు పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకున్న సందర్భం ఉంది. గ్రామాల్లో మూఢనమ్మకాలు రోడ్డు భద్రత పల్లె పదం జానపదం ప్రజా చైతన్య గీతాలతో ప్రజలను ఆయన చైతన్యవంతులను చేసినారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ తనకి బాధ్యతను అప్పజెప్పినటువంటి జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈనెల 25 తారీకు హైదరాబాదులో జరగబోయే రాష్ట్ర ప్రజానాట్యమండలి మహాసభను జయప్రదం చేయగలరని కోరారు.

# కొంపల్లి వీజీ హోమ్స్ లో దోమలపై అవగాహన



కుత్బుల్లాపూర్, మే 15, హైదరాబాద్ పల్స్ న్యూస్ :
మాటల్లో కాదు, చర్యల్లో కనిపించింది, కొంపల్లి జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ సర్కిల్ - నార్త్ జోన్ పరిధిలోని కొంపల్లి వీజీ హోమ్స్ లో "ఫ్రైడే - డ్రై డే " పేరుతో దోమల నివారణ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఇది సాధారణ మీటింగ్ కాదు ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి ఒక హెచ్చరిక. ఇళ్ల చుట్టూ నిల్వ నీరు, పాత టైర్లు, కుండీలు, చిన్న చిన్న పాత్రలు కూడా దోమల పెంపక కేంద్రాలుగా మారుతాయని జిహెచ్ఎంసి టీమ్ ప్రత్యక్షంగా వివరించింది. ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి నేరుగా కమ్యూనిటీలోకి వచ్చి కార్యక్రమం నిర్వహించిన జిహెచ్ఎంసి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు. సమాజ బాధ్యతతో ముందుకు వచ్చి మాట్లాడిన పిల్లలకు, ముఖ్యంగా ధైర్యంగా పాల్గొన్న చిన్నారులకు ప్రత్యేక ప్రశంసలు. ఒక కమ్యూనిటీ కలిసి ఆలోచిస్తే... కలిసి చర్య తీసుకుంటే...దోమలకు అక్కడ స్థానం ఉండదు. ఒక పొడి మూల... రేపు ఒక కుటుంబాన్ని కాపాడొచ్చు. ఆరోగ్యకరమైన సమాజం కోసం కొంపల్లి వీజీ హోమ్స్ చూపించిన చొరవ అభినందనీయం.

# ఆల్ టైమ్ కనిష్టానికి రూపాయి పతనం.!




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, సెంట్రల్ డెస్క్:
అమెరికన్ డాలర్ తో పోలిస్తే.. రూపాయి విలువ మరింత పతనమైంది. శుక్రవారం మధ్యాహ్నం ఇన్ ట్రా డే లో గతంలో ఎన్నడూ లేని రీతిలో.. రూపాయి విలువ జీవితకాల కనిష్ఠానికి చేరుకోవడం గమనార్హం. ఈ పరిణామం భారత్ బాహ్య రంగానికి సవాళ్లను మరింత పెంచుతోంది. యూఎస్ డాలర్ తో పోలిస్తే.. రూపాయి విలువ 0.3 శాతం క్షీణించి 96.07 వద్దకు పడిపోయింది. గత సెషన్లో రూపాయి విలువ 95.9575 కనిష్టానికి చేరుగా.. తాజాగా మరింత పతనమై కొత్త రికార్డును నమోదు చేసింది. గ్లోబల్ మార్కెట్లో నెలకొన్న ఒత్తిడుల కారణంగా రూపాయి మారకం విలువ వరుసగా పతనమవ్వడం.. ఆర్థిక వర్గాల్లో ఆందోళనను పెంచుతోంది.

రూపాయి విలువ పతనమవ్వడానికి కారణం..
చమురు దిగుమతులు పెరగడమేనని నిపుణులు చెబుతున్నారు. భారత్ తన అవసరాలకు కావలసిన చమురులో 80 శాతంకంటే ఎక్కువ దిగుమతి చేసుకుంటోందని, దీంతో చమురు ధరలు బ్యారెల్ కు 110 డాలర్లకు చేరగా.. దిగుమతుల భారం పెరిగి డాలర్లకు డిమాండ్ ఏర్పడటం వల్ల రూపాయి విలువ పతనమైనట్లు వివరించారు. ఇంధన దిగుమతుల ఖర్చులు పెరిగితే.. దాని ప్రభావం ట్రేడ్ డెఫిసిట్ పై తీవ్రంగా ఉంటుందని తెలిపారు.

# తెలంగాణలో ఒక్కసారి గెలిస్తే ఇంకెప్పుడూ ఓడిపోం : రాంచందర్ రావు

తెలంగాణలో ఒక్కసారి గెలిస్తే ఇంకెప్పుడూ ఓడిపోం : రాంచందర్ రావు

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, మెయిన్ డెస్క్ : తెలంగాణలో అధికారంలోకి రావడమే తమ ఫస్ట్ టార్గెట్ అని.. ఇది 2028లో నెరవేరుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఆల్రెడీ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను ప్రజలు చూశారని ఇక ఇప్పుడు టైమ్ బీజేపీదేనని చెప్పారు. శుక్రవారం వే టు న్యూస్ కాన్క్లేవ్‌లో ఆయన మాట్లాడారు. గతంతో సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామన్నారు. టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకోమని.. కానీ బీజేపీ కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తే మాత్రం స్వాగతిస్తామని పేర్కొన్నారు.

**ఎవరితో పొత్తులుండవు..**

ఏదైనా ప్రాంతంలో రెండు పార్టీల మధ్య పోటీ ఉంటే మూడో పార్టీ రావాలంటే కొద్దిగా కష్టమైతది. కానీ తెలంగాణలో ఆ పరిస్థితి లేదు. ప్రజలు ఆల్రెడీ బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ పాలన చూశారు. ఇప్పుడు టైమ్ బీజేపీదే. వేరే పార్టీ వాళ్లు, ఇతర ప్రముఖులు స్వతహాగా మా పార్టీలో చేరుతున్నారు. మేము 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. గతం గతహా.. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తాం. టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకోం. కానీ బీజేపీ కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తే స్వాగతిస్తాం అని బీజేపీ చీఫ్ వ్యాఖ్యానించారు.

**రైతుల కోసం కొట్లాడింది బీజేపీనే..**

తెలంగాణలో రైతుల సమస్యలపై ముందు పోరాడింది బీజేపీనే. మా ప్రభుత్వం ఎమ్.ఎస్.పి పెంచినా క్షేత్ర స్థాయిలో తక్కువ ధరకు కొని మోసం చేస్తున్నారు. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ రాబోయే కాలంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది. మేము ఒక్కసారి వస్తే మమ్మల్ని పంపించడం చాలా కష్టం. ఇది ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి అని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

**బండి సంజయ్ కుటుంబ విషయంలో మేం జోక్యం చేసుకోం..**




బండి సంజయ్ కుమారుడి కేసు పూర్తిగా వాళ్ల కుటుంబం విషయం. మా పార్టీ వ్యక్తి ఆ కేసులో లేడు. ఆ వ్యక్తి కుటుంబానికి చెందిన వ్యక్తి ఉన్నడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తారు. మేము ఎలాంటి లీగల్ విషయాల్లో జోక్యం చేసుకోం. కావాలని కొందరు రాజకీయం చేస్తున్నారు. బీఆర్ఎస్ వాళ్లు అమ్మాయికి న్యాయం చేయాలని అనడం లేదు. ఎంత సేపు బండి సంజయ్ కుటుంబాన్ని డీఫెమ్ చేస్తున్నారు. మెట్రోలో, గోడలపై పోస్టర్లు అంటించి రాజకీయం చేస్తున్నారు అని రాంచందర్‌రావు మండిపడ్డారు.

## కొత్తగూడెం ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్

# వివిధ విభగాల అదిపతులతో సమీక్ష




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :

కొత్తగూడెం ఏరియా జిఎం కార్యలయం నందు మల్టి డిపార్ట్మెంటల్ టిమ్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగుల బద్రతా ప్రమాణాలు, మరియు కంపెనీ ముందున్న సవాళ్ళు, నాణ్యతతో కూడిన బొగ్గును సరఫరా చేయడం వంటి విషయాలు చర్చించడం జరిగింది అలాగే 2026 --27 సంవత్సరానికి గాను సింగరేణి సంస్థ వ్యాప్తంగా 680 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ని నిర్దేశిచడం జరిగిందని, అందులో భాగంగా కొత్తగూడెం ఏరియాకు గాను 22.50,(పి వి కె కి 2.50 వి కె సి ఎం కి 20.00) లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించారని తెలియజేశారు. సింగరేణి వ్యాప్తంగా అన్నీ ఏరియాలలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధన గురించి, ఈ నెల 18వ తేది నుండి అన్ని గనులు విబాగాలలో, మల్టి డిపార్ట్మెంటల్ టీమ్ లు సమావేశాలను నిర్వహించి తద్వారా అధికారులు ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని వాటి ద్వారా భద్రత తో కూడిన వార్షిక లక్ష్యాలను చేదించే దిశగా ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందని ఏరియా జిఎం ఎం.షాలెమ్ రాజు తెలిపారు. గనులు విభాగాల ఎండీటీ మీటింగ్ ప్రణాళిక ఈ విదంగా ఉన్నాయి. 18 మేఉదయం గంటలకు పివికె 5 ఇంక్లైన్ గని యందు మొదటి షిఫ్ట్ మధ్యహ్నం 3 గంటలకు( రెండవ షిఫ్టు).21 మే : మద్యాహ్నం 3.00 గంటలకు జిఎం కార్యలయం నందు 22 మే : ఉదయం 7గంటలకు వి కె సి ఎం ఏరియా స్టోర్ , మద్యాహ్నం 3.00 గంటలకు సివిల్ ఉ ఎస్‌ఉ పీసీ , ఎంసీటీసీ ఆర్ డీ పీ డిస్పెన్సరీ నందు.23 మే : ఉదయం 7 గంటలకు ఆర్ సీ హెచ్ పీ , 11గంటలకు ఏరియా వర్క్ షాప్ నందు సమావేశాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు .ఈ సమావేశంలో జిఎం తో పాటు , (ఎస్.ఓ.టు జిఎం) కోటిరెడ్డి , ఏజీఎం (సివిల్) రామకృష్ణ , డిజిఎం (ఐఈడి) యోహన్ , ఏజిఎం ( ఫైనాన్స్ )



బీబత్స, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు, డిజిఎం (ఈఉఎం) ఏరియా వర్క్ షాప్ క్రిస్టోఫర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, (ఆర్.సి.హె.చ్.పి) ఇంచార్జ్ ఆజ్మీరా శ్రీనివాస్, (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి వి. మల్లికార్జున రావు ఏఐటీయూసీ) అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య , (ఐఎన్‌టీయూసీ) వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఇతర విభాగాల అదికారులు పత్రికా మిత్రులు పాల్గొన్నారు.

# భోజ్‌శాలా ఆలయం హిందువులదే.. హైకోర్టు సంచలన ప్రకటన!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, సెంట్రల్ డెస్క్: మధ్యప్రదేశ్ లోని ధార్ జిల్లాలో ఉన్న వివాదాస్పద భోజ్‌శాలా సముదాయంపై శుక్రవారం హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కట్టడం రాజా భోజుడు నిర్మించిన వాగ్దేవి(సరస్వతీ) ఆలయమేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలో (2003లో) భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) చేసిన ఏర్పాటును కోర్టు కొట్టివేసింది. అప్పట్లో హిందువులు మంగళవారం పూజలు చేసుకోవడానికి, ముస్లింలు శుక్రవారం నమాజ్ చేసుకోవడానికి అనుమతి ఉండేది. అయితే తాజాగా కోర్టు ఈ ఉమ్మడి ప్రార్థనల విధానాన్ని రద్దు చేస్తూ.. అక్కడ హిందూ ఆరాధనల కొనసాగింపును గుర్తించింది.


**భారత పురావస్తు శాఖకు కోర్టు ఆదేశాలు**

ఈ వివాదాస్పద స్థలం విషయంలో హైకోర్టు భారత పురావస్తు శాఖకు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కట్టడం పరిరక్షణ, సంరక్షణ బాధ్యతలను పూర్తిగా భారత పురావస్తు శాఖ పర్యవేక్షణలోనే ఉంచాలని కోర్టు పేర్కొంది. పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాల చట్టం కింద దీనిని సంరక్షించాలని సూచించింది. లండన్ మ్యూజియంలో ఉన్న సరస్వతీ దేవి విగ్రహాన్ని తిరిగి తీసుకురావాలని హిందూ పక్షాలు కోరుతున్న నేపథ్యంలో, ఆ విగ్రహాన్ని రప్పించి భోజ్‌శాలాలో ప్రతిష్టించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని న్యాయస్థానం పేర్కొంది.

**చారిత్రక ఆధారాలు**

భోజ్‌శాలాను సరస్వతీ ఆలయంగా నిర్ధారించడానికి కోర్టు పలు చారిత్రక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ధార్ ప్రాంతాన్ని సంస్కృత విద్యకు కేంద్రంగా మార్చిన పారామర వంశపు రాజు రాజా భోజుడితో ఈ కట్టడానికి ఉన్న అనుబంధాన్ని కోర్టు ప్రస్తావించింది. అక్కడ లభించిన శాసనాలు, పురావస్తు అవశేషాలు, వాస్తుశిల్ప రీతులను చారిత్రక ఆధారాలుగా స్వీకరించింది. సాహిత్య ఆధారాలు కూడా ఇక్కడ ఒకప్పుడు గొప్ప సంస్కృత పాఠశాల, సరస్వతీ ఆలయం ఉన్నట్లు ధ్రువీకరిస్తున్నాయని న్యాయమూర్తులు జస్టిస్ విజయ్ కుమార్ శుక్లా, జస్టిస్ అలోక్ అవస్థీలతో కూడిన ధర్మాసనం వెల్లడించింది.

**మసీదు కోసం ప్రత్యామ్నాయ భూమి**



హిందువుల హక్కులను గుర్తిస్తూనే, ముస్లిం వర్గాల మతపరమైన హక్కులను కాపాడేందుకు కోర్టు ఒక ప్రతిపాదన చేసింది. ముస్లిం పక్షాలు దరఖాస్తు చేసుకుంటే, ధార్ జిల్లాలోనే మసీదు నిర్మాణం కోసం తగిన ప్రత్యామ్నాయ భూమిని కేటాయించే విషయాన్ని పరిశీలించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ తీర్పుపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్పందిస్తూ, ఇది బాబ్రీ మసీదు తీర్పును పోలి ఉందని, సుప్రీంకోర్టులో దీనికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రైవేట్ డైరీలను నమ్మి మోసపోవద్దు...

**మదర్ డెయిరీకి పూర్వ వైభవం తీసుకొద్దాం....**
**డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, సంధిల భాస్కర్ గౌడ్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : డైరీ రంగంలో విప్లవత్మకమైన మార్పులు తీసుకొచ్చి క్షీర విప్లవం వైపు అడుగులు వేసుకుంటూ మదర్ డైరీ కి పూర్వైవం తీసుకొద్దామని డైరీ డైరెక్టర్లు సందిల భాస్కర్ గౌడ్, గొల్లపల్లి రాంరెడ్డి లు అన్నారు. శుక్రవారం రాజపేటలో పాలశీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే మదర్ డైరీ లక్ష్యమని తెలిపారు. మూడు నెలలకు సంబంధించిన ఆరు బిల్లులను రైతులకు అందజేశారు. ప్రైవేట్ డైరీ లను నమ్మి మోసపోవద్దని అన్నారు. సరైన పోషణతో అధిక పాల దిగుబడిని సాధించి మదర్ డైరీ అభివృద్ధికి బాటలు




వేయాలని పేర్కొన్నారు. నాణ్యమైన పాలు తీసుకొచ్చి అధిక ధరలను పొందాలని సూచించారు. ఎన్.డి.డి.బి సహకారంతో డైరీ ని ప్రగతి పథంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సొసైటీ అధ్యక్షులు ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మిగతా బాకీ ఉన్న బిల్లులను తొందరలోనే చెల్లిస్తామని



హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు ఆర్కాల గాల్ రెడ్డి, చింతలపూరి వెంకట్రాంరెడ్డి, మేనేజర్ మాధవరం శేఖర్, సూపర్వైజర్ దిడ్డిరాములు, వివిధ గ్రామాల చైర్మన్లు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ శ్రీవాణి రవికుమార్



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన 2వ సమావేశంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ పాల్గొన్నారు తూర్పు తెలంగాణ స్థానిక సంస్థల ప్రతినిధులు మరియు అధికారులతో, సూర్యాపేట కలెక్టరేట్ లో సమావేశం, స్థానిక సంస్థలు తమ యొక్క ఆదాయ వనరులను పెంచుకునే విధానం, స్టేట్ ఫైనాన్స్ ద్వారా స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులు మరియు ముఖ్యమైన సమస్యలు చర్చించి, ఈ సమావేశం ద్వారా సూచనలు , సలహాలు ప్రజా ప్రతినిధులకు అధికారులకు తెలియపరిచారు .

## దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన చైర్మెన్, పాలక మండలి ప్రమాణస్వీకారం




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వెంకటాపురం శ్రీ శ్రీ శ్రీ వెంకటగిరి స్వయంభూ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన చైర్మెన్ మరియు పాలక మండలి ప్రమాణస్వీకారం శుక్రవారం రోజున అట్టహాసంగా జరిగిందనీ తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎరుకల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ట్రస్ట్ బోర్డు చైర్మెన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గుంటి మహేష్ యాదవ్ మరియు పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగిందనీ ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్తాయపల్లి గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, దత్తాయపల్లి, వెంకటాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు దేవరుప్పల మల్లేష్, రాగుల శ్రీనివాస్,ఉప సర్పంచ్ జిట్టా కిషన్ యాదవ్, వార్డు మెంబర్ ధ్యాన బోయిన నవీన్, నాయకులు, గుంటి మల్లేష్ యాదవ్, ధ్యానబోయిన కరుణాకర్, కొండారి పరమేశ్, భగవంతు, ధ్యానబోయిన పోచయ్య, గొప్ప కొండల్ రెడ్డి, గొప్ప హనుమంత్ రెడ్డి, ధ్యాన బోయిన వెంకటేష్, కొడారీ నాగరాజు తదితరులు ఉన్నారు

## జహంగీర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన హీరేకార్ శ్రీను



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ ని కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హీరేకార్ శ్రీను అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి, యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి లడ్డు ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు కాకునూరి మహేందర్, గాజుల కృష్ణ, గుత్తి శివుడు, పుట్ట శివకుమార్, సిల్వర్ శీను, గోపే ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ముదిరాజ్ సంఘ భవనం శంకుస్థాపన చెసిన రంగ నరేష్

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం పాముకుంట గ్రామంలో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి శుక్రవారం రాజపేట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రామ పెద్దలు ముదిరాజ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



# వనమా రాఘవేందర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన. వనమా రాఘవేందర్**

**అధికారులతో రైస్ మిల్లర్లు దళారులు కుమ్మక్కు. వనమా రాఘవేందర్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం పెనుగడప వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ కొత్తగూడెం నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు.పెనుగడప వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అనంతరం రైతులతో మాట్లాడిన వనమా రాఘవేందర్ వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరి ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడున్నటువంటి ప్రభుత్వ అధికారిని తో మాట్లాడగా మాపై అధికారులతో మాట్లాడవలసింది గా అధికారిని, కోరగా అందుబాటులో అధికారులు లేని పక్షంలో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సరిత గతిన చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమాన్ని, ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులను చిన్న చూపు చూస్తుందని రైతుల పట్ల నిర్లక్ష్యం వాయిస్తుందని అదేవిధంగా రైతులకు యూరియా పంపిణీ విషయంలో ప్రభుత్వం ఫెయిల్ అయిపోయిందని కరెంటు 24 గంటలు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతూ ఇవ్వాలా వరి ధాన్యం కొనుగోలు విషయంలో కూడా అదే విధంగా ప్రవర్తిస్తూ కోతలు పెట్టి అప్పటికి దాన్యం కొనుగోలు చేస్తామని నెల రోజులుగా చెబుతూ ఇప్పటివరకు ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని అకాల వర్షం పడితే రైతుల దుస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో 24 గంటలు కరెంటు ఇచ్చి టైం కు యూరియా అందించి కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటుచేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసిన ఘనత కెసిఆర్ కెసిఆర్ ది అని గుర్తు చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు,లేనియెడల రైతుల పక్షాన మా బి ఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతామాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బి ఆర్ ఎస్ (38) వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్, హమీద్, నరేందర్, చింతలపూడి జగన్, పెద్దమల్ల నరేందర్, ఉర్దూగా మాజీ చైర్మన్ అన్వర్ పాషా, రుక్మందర్ బండారి, వేముల ప్రసాద్, అమ్ముల వేణు, మాజీ సర్పంచ్ మోతి, శివ,



శ్రీకాంత్, బత్తుల శీను, కన్ని, హైమద్, బొందుగుల శ్రీధర్, సురేందర్, పావులూరు చంద్రయ్య, ముత్యాల ప్రవీణ్, పిల్లి కుమార్, బట్టు మంజుల, పాషా, కాజా, లచ్చిరాం, మనోజ్, వినోద్,భూపతి శ్రీను, సయ్యద్ జానీ, కాళీ, కాపు శ్రీకాంత్, ఇర్ఫాన్, యూనిరి రాజేష్,ముదిగుల శివ, నూతన్, జగడం కిరణ్, జూపెల్లి దుర్గాప్రసాద్, వాసు మల్ల గౌతం, ఎస్ కే అహ్మద్ ఎస్కే అహ్మద్, అప్సర్ జహ 1వ వార్డు మెంబర్, తగరం శీను, విడగొట్టి మహేష్, వినగంటి శ్రీను, బషీర్ భాష, యాకూబ్ గోరి, పావురాల పుల్లయ్య, కట్టా వెంకన్న, పోతురాజు సతీష్, కట్టా మహేష్, పోతురాజు శీను, కట్ట నాగమణి, పి రమణ, కట్టా ప్రవీణ్, కట్ట భార్గవ్, వద్దే మనోజ్, యూసఫ్ ఖాన్, ఈ రాంబాబు, తగరం రాంబాబు, ఉరుపెట్టి పుల్లయ్య, మంగళగిరి రామకృష్ణ, పింగళి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శి పై ఫిర్యాదుని స్వీకరించిన కలెక్టరేట్


## ఎంపీఓ సమక్షంలో విచారణకు ఆదేశం

హైదరాబాద్ పల్స్, మే 15, షాద్నగర్ :
కొత్తూరు మండల పరిధిలోని కోడిచర్ల తండా గ్రామ పంచాయతిలో గత నెలలో పంచాయతీ కార్యదర్శి పై పలు ఫిర్యాదులు చేసిన అంశాలు కలెక్టరెట్ లో ప్రజావాణి కార్యక్రమంలో సబ్మిట్ చేశారు. దీనిపైన గురువారం కోడిచర్ల తండా గ్రామ పంచాయతీలో ఎంపీఓ విజయ లక్ష్మి సమక్షంలో ఇరువురిపై విచారణ కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి గారు ఏ అంశం పైన సంతృప్తికరమైన సమాధానం చెప్పకుండా పొంతన లేని సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. అదేవిదంగా విచారణలో డిప్యూటీ సర్పంచ్ మరియు వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి పైన పిర్యాదు చేసిన ప్రతి అంశాల మీద ప్రతి సమాధానని వివరంగా వివరణ ఇచ్చారు. మరియు లిఖితపూర్వకంగా కూడా రాసి ఇచ్చిన వివరణపై ఎంపీఓ విజయ లక్ష్మి సంతృప్తి చెందినట్టు సమాచారం. పంచాయతి కార్యదర్శిపై విచారణ అధికారి ఆగ్రహం వక్యం చేస్తూ.. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకునే విధంగా నివేదిక తయారు చేసి పై అధికారులకు పంపిస్తానని వార్డు సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది. అదే విదంగా కార్యదర్శి గారు ఈ నెలలోపు బదిలీ అవుతారని స్పష్టమైన హామీ ఇచ్చినటు వార్డు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతి విష్ణు నాయక్, డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్,బిచ్య నాయక్, వినోద్ నాయక్, సంతోష్ నాయక్,లలిత నాయక్,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## అనధికార నిర్మాణాలను ఆపండి

# అక్రమ లేఔట్ల కు చెక్ పెట్టండి : ఆకుల సతీష్




**కుత్బుల్లాపూర్, మే 15, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కుత్బుల్లాపూర్ మల్లంపేట్ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో కొనసాగుతున్న అక్రమ లేఅవుట్లు, అనధికార విల్లా నిర్మాణాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు చట్టవిరుద్ధ భవన అనుమతుల వ్యవహారం మరింత వివాదాస్పదంగా మారింది.మల్లంపేటలో జిఎల్ఎస్ కాలనీ పేరుతో అభివృద్ధి చేసిన లేఅవుట్‌కు హెచ్ఎండిఏ లేదా సంబంధిత సంస్థల అనుమతులు లేకపోయినా, గ్రామపంచాయతీ, మున్సిపల్ రికార్డుల్లో ఎటువంటి అప్రూవ్డ్ లేఅవుట్ అప్లోడ్ లేకపోయినా, ఎ1, బి1, సి1, డి1 పేర్లతో ప్లాట్ నెంబర్లు సృష్టించి, నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది విల్లాలకి అక్రమంగా అనుమతులు జారీ చేయడమే కాకుండా 16 విల్లాల అప్లికేషన్లు షార్ట్ ఫాల్ కింద పెండింగ్లో పెట్టారు దానిలో విజయలక్ష్మి ఐదో అనుమతులు అప్లై చేసింది.ప్రత్యేకంగా, 2025 డిసెంబర్‌లో అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్, జిహెచ్ఎంసి లో విలీనం జరగకముందే చట్టవిరుద్ధంగా భవన అనుమతులు మంజూరు చేసినట్లు సమాచారం. ఇప్పటికే సంబంధిత సర్వే నంబర్లపై వివాదాలు, కలెక్టర్ ప్రొసీడింగ్స్ , పోలీస్ కేసులు మరియు రిజిస్ట్రేషన్ నిలిపివేత చర్యలు ఉన్నప్పటికీ, ఈ అనుమతులు ఎలా జారీ అయ్యాయన్న దానిపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఆర్.టి.ఐ ద్వారా వెలుగులోకి వచ్చిన **వివరాల ప్రకారం:** అనుమతి లేని లేఅవుట్‌లో సుమారు 200 విల్లాలు నిర్మించబడ్డాయి. ప్రభుత్వ భూమిలో సుమారు 35 విల్లాలు నిర్మించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కట్టమ చెరువు పరిధిలో నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. భూమి కొనుగోలు చేసిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమిని



విక్రయించి రిజిస్ట్రేషన్లు చేసినట్లు రికార్డులు సూచిస్తున్నాయి.ఈ మొత్తం వ్యవహారం జిహెచ్ఎంసి యాక్ట్, 1955 హెచ్ఎండిఏ నియమావళి ఉల్లంఘనగా భావించబడుతోంది.అందువల్ల సంబంధిత అధికారులను కోరుతూ: అక్రమంగా జారీ చేసిన అన్ని అనుమతులను తక్షణమే రద్దు చేయాలి. ఎ1, బి1, సి1, డి1 పేర్లతో జారీ చేసిన ప్లాట్ అనుమతులపై పూర్తి స్థాయి విచారణ జరపాలి. అప్పటి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ పాత్రపై విచారణ చేసి శాఖాపర, చట్టపర చర్యలు తీసుకోవాలి. అక్రమ నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రభుత్వ భూములను రక్షించి ప్రజలను మోసపూరిత లావాదేవీల నుంచి కాపాడాలి.ఈ అంశంపై ప్రభుత్వం, జిహెచ్ఎంసి సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకుని ప్రజా ప్రయోజనాలను కాపాడాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

# చల్లని కబురు... నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేస్తున్నాయ్..!

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, మెయిన్ డెస్క్ :
ఎండలతో అల్లాడుతున్న జనానికి భారత వాతావరణ విభాగం చల్లని కబురు చెప్పింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే రాబోతున్నాయి. ఎల్ నినో ప్రభావంతో ఇప్పటికే పలు చోట్ల వడగాల్పులకు తోడు అకాల వర్షాలు కురుస్తుండగా.. ఇప్పుడు నేరుగా రుతుపవనాలే వచ్చేస్తున్నాయి. దేశానికి జీవనాధారమైన రుతుపవనాల కోసం ఈ సంవత్సరం వేచి ఉండాల్సిన సమయం సాధారణం కంటే తక్కువగా ఉండవచ్చని వాతావరణ విభాగం వెల్లడించింది.ప్రతీ ఏటా నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1న కేరళలో ప్రవేశించాల్సి ఉంది. కానీ ఈసారి మాత్రం దాదాపు ఆరు రోజుల ముందుగానే అంటే మే 26న అవి కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఇవాళ అంచనా విడుదల చేసింది. ఈ అంచనాలో నాలుగు రోజుల అటూ ఇటూ ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. అంటే రుతుపవనాలు మే 22 నుండి మే 30 మధ్య ఎప్పుడైనా రావచ్చని అంచనా వేస్తున్నారు.ప్రస్తుతం దేశంలో చాలా ప్రాంతాలు తీవ్రమైన వడగాలులతో అల్లాడుతున్నాయి.రాజస్థాన్‌లోని బార్మర్‌లో మే 11న 47.3డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో వడగాలుల హెచ్చరికలు అమల్లో ఉన్నాయి. ఇలాంటి సమయంలో కేరళలో రుతుపవనాల రాకతో, తీవ్రమైన వేసవికి ముందు కాలం అధికారికంగా ముగిసిపోతుంది. అలాగే ఉపఖండం అంతటా వర్షాలు క్రమంగా ఉత్తరం వైపు సాగడానికి ఇది సంకేతం. ఈ పరిణామం సాధారణంగా జూలై మధ్య నాటికి భారతదేశం మొత్తానికి విస్తరిస్తుంది.



# వివాదంలో ఉన్న దారి...భూమిని విక్రయిస్తున్న సాల్వో ఇండస్ట్రీస్ లిమిటెడ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో సర్వెనెంబరు 322/4 లోని సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అక్రమంగా ప్లాట్ల విక్రయం జరుగుతూ అమాయకులను మోసం చేస్తున్నారని పలువురు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద 2023 సంవత్సరంలో డిటిసిపి హైదరాబాద్ వారి నుండి టి.ఎల్. పి.నంబర్ 161/2023/హెచ్ 70.59 సెంట్స్ లేఅవుట్ పర్మిషన్ తీసుకున్నారని వివరించారు. ఈ లేఅవుట్ కు సంబంధించిన దారి 0.24 గుంటలు 2020లో బాగస్థుల మధ్య వివాదం వలన ఆలేరు కొర్టులో సివిల్ వివాదములో ఉన్నదని తెలిపారు. ఓఎస్5/2020 ఈ లేఅవుట్ భూమి హద్దు దారుల శ్రీనాధ్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 70.59 సెంట్స్ సర్వే డిమార్కషన్ సర్టిఫికెట్ చెల్లదు అని తెలంగాణ హైకోర్టు డబ్ల్యూ పి నంబర్ 9691/2024 ద్వారా ఆశ్రయించినట్లు వివరించారు. ఈ వివాదాము పై తెలంగాణా హైకొర్టు స్టే ఇచ్చరని, కాని ఇప్పుడు సాల్వో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రజలకు లేఅవుట్లో ప్లాట్లు విక్రయిస్తూన్నారని తెలిపారు. ఆమాయక ప్రజలు మోసపోకుండా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మాస శివరాత్రి సందర్భంగా శివయ్యకు అభిషేకాలు....




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. శివలింగానికి పంచామృత ఫలారస అభిషేకాలు మంత్రోచ్చారణల మధ్య జరిగింది. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అలంకరణ పుష్పాలంకరణ మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ జరిగింది. మాస శివరాత్రి విశేషతను చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వివరించారు

# నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం పాముకుంట గ్రామంలో రాజపేట మండల మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బడే ఉపేంద్రమ్మ నూతన గృహప్రవేశం శుక్రవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, సర్పంచులు, మండల మహిళా నాయకులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# ఉపాధి హామీ పాత చట్టాన్ని కొనసాగించాలి.....

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పాలు**




హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రాజపేట మండలం బొందుగుల గ్రామంలో శుక్రవారం పనిచేస్తూ ఉపాధి కార్మికులు నిరసన తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధి హామీ కార్మికుల గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ ద్వారా చెరువులో పూడికతీత గట్ల నిర్మాణాలు మట్టి పనులు రహదారులు కాలువ నిర్మాణం, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికుల పొట్ట గొట్టే ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి విబి జి రాంజీ పథకం తెచ్చి కొత్త కొత్త జీవోలతో కార్మికులను పనికి దూరం చేస్తున్నారు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు లేక కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు చేసిన పనికి కూలి ఎంత వస్తుందో చెప్పకుండా వారం వారం డబ్బులు ఇవ్వకుండా కార్మికులను అవస్థలు పాలు చేస్తున్నారు ఇప్పటికైనా ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల కార్యదర్శి కట్ట రవికుమార్, మండల గౌరవ అధ్యక్షులు గొల్లూరి ప్రభాకర్, కట్ట శ్రీకాంత్, ముక్కా పూసయ, కొమ్ము ఎల్లమ్మ, కొల్లూరు పుష్ప, ముక్క సోమరాజవ్వ, గురిజాకుంట ప్రమీల, బోయిని అరుణ, బల్లి సుగుణ, రేణుక, ముక్క ఉమా, ఉప్పరివాని యేసయ్య, కార్మికులు పాల్గొన్నారు. జీవోను రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం 90% నిధులు కేటాయించాలని పట్టణ పేదలకు ఉపాధి పని పెంచాలని ఈ సందర్భంగా పాల్ డిమాండ్ చేశారు.

# బైకని రాజయ్య కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ సాయం



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం చల్లూరు గ్రామంలో ఇటీవల మరణించిన బైకని రాజయ్య కుటుంబాన్ని శుక్రవారం గ్రామ శాఖ అధ్యక్షులు శాగ నవీన్ ఆధ్వర్యంలో పరామర్శించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ ఉప సర్పంచ్ బొంత సుధాకర్, బైకని కనకయ్య, సొల్లేటి స్వామి, మీసా బాల మల్లయ్య, చేట్కూరి గౌరయ్య, మునిగడప కనకయ్య, పెంట శ్రీహరి, మంతపురి పరశురాములు, బొంత రాజు, బైకని మల్లయ్య, బైకని శ్రీరాములు కుటుంబ సభ్యులున్నారు.

# బేగంపేటలో జింక మృతి పలు అనుమానాలు ....



హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం బేగంపేట గ్రామ సమీపంలో జిట్ట శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ బావి వద్ద మృతి చెందిన జింక శుక్రవారం గ్రామస్తులకు రైతులకు కనిపించింది. జింక చనిపోయి ఉండడంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. సమీప ఫెన్సింగ్ తీగకు బలంగా ఢీకొని తలకు తీవ్రంగా గాయమై మృతి చెందిందా లేక ఎవరైనా చంపేశారా అనే విషయమై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చల్లూరు నుండి బేగంపేట వెళ్లే రోడ్డులో ఈ వ్యవసాయ భూమి మెయిన్ రోడ్డు కి దగ్గరగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా అంతకు ముందు రెండు జింకలు పరిగెడుతుండడం చూసినట్లు కొందరు రైతులు చెబుతున్నారు.

# విచ్చలవిడిగా సిండికేట్గా మద్యం దందా

**వైన్ షాపుల సిండికేట్ లో "సి" గ్రేడ్ బ్రాండ్స్ బెల్ట్ షాపులకే పరిమితం**

**వైన్ షాపుల్లో నాలుగు బ్రాండ్లు మాయం**

**గ్రామాల్లో రోజు రోజుకు పెరుగుతున్న బెల్ట్ షాపులు**

**వైన్స్ నుంచి ప్రత్యేక వాహనాల్లో బెల్ట్ షాప్ లకు సరఫరా**

**చోద్యం చూస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి**

బూర్గంపహాడ్ మండలంలోని వైన్ షాప్ యజమానులు సిండికేట్ గా దందాకు తెరాలేపారు. ప్రభుత్వం అధికార లెక్కల ప్రకారం మొత్తం 5 వైన్ షాప్ల గ్రామాల్లో బెల్ట్ షాపులకు మాత్రమే మద్యాన్ని అధిక రేట్లకు విక్రయిస్తారు. ఈ మొత్తం వైన్ షాపులకు సిండికేట్ గా వ్యవహరిస్తున్న సీతయ్య పాత్ర వుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అతను చెప్పినట్లుగానే మిగతా వైన్ షాప్ యజమానులు కూడా ఉండి సిండికేట్ గా మధ్యాన్ని విక్రయాలు జరుపుతున్నారు. వైన్స్ షాపుల యజమానుల అండ దండలతో బెల్ట్ షాపులు ఇష్టా రీతిన అధిక ధరలకు అమ్ముతూ పచ్చని గ్రామాల్లో మద్యం ఏరులై పారిస్తున్నారం. మండలంలోని అన్ని గ్రామాలలో బెల్టు దందా జోరుగా కొనసాగుతుందంటే నమ్మాల్సిందే, మారు మూల గ్రామాలు కూడా మద్యం మత్తులో జోగుతున్నాయి. గ్రామాల్లో తండాలో పుట్టగొడుగుల బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నయంటే అంటే ఏమాత్రం ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ లు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రోజువారి కూలీలకు వెళ్లే ప్రజలు జేబులకు చిల్లు పడుతున్నాయి. కొంతమంది ప్రజలు అప్పులు చేసి మరి మద్యం తాగడంతో పలు కుటుంబాలు వీధి పాలవుతున్నాయి.



**మందు మొత్తం బెల్టు షాపులకే అమ్మకాలు:**

మండలంలోని వైన్ షాపుల యజమానులు బెల్టు షాపులకి మందు విక్రయించేందుకు అధిక ప్రధాన్యత ఇస్తున్నారు. కస్టమర్స్ కు నేరుగా అమ్మితే ఎమ్మార్పీ రేటు మాత్రమే వస్తుంది, అదే బెల్టు షాపులకు అమ్మితే ఎమ్మార్పీ రేటుకు ఒక బాటిలుకు 25 నుంచి 35 రూపాయలు అదనపు రేటు వస్తుందని ఉద్దేశంతో వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ, గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం వైన్స్ అమ్మకాలు చేపడుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహించేవారు బాటిల్ పై 40 రూపాయలు చొప్పున అధిక ధరలకు విక్రయిస్తూ ఉండటం గమనార్హం. వైన్ షాపులలో పేరు ఉన్న బ్రాండ్ల మద్యం ను వైన్ షాపులలో స్టాక్ పెట్టకుండా బెట్టు షాపులో స్టాక్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు జాగ్రత్త పడుతున్నారు. వైన్ షాపులకు వచ్చిన కస్టమర్లకు మాత్రం అడిగిన బ్రాండ్ లేదని ఇతర బ్రాండ్లకు చెందిన సీసాలను అంటగడుతూ డబ్బులు పోగేసుకుంటున్నారు. వైన్ షాప్ నిర్వహక్కంతో రోజు రోజుకు కొత్త బెల్ట్ షాపు పుట్టుకొస్తున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు.



**ప్రత్యేక వాహనాల ద్వారా బెల్ట్ కు సరఫరా:**

మండలంలో 5 లైసెన్స్ షాప్ లు ఉన్నాయి. వీటి ద్వారా అమ్మకాలు అక్కడే జరగాల్సి ఉండగా, వాటి ద్వారా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి మద్యాన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. గ్రామాలకు మధ్యాన్ని అందించేందుకు ఏ దుకాణానికి ఏ గ్రామాలు అందుబాటులో ఉన్నాయో చూసుకుని ఆ వైన్స్ నుంచి ఆటోలో ఇతర వాహనాల ద్వారా బహిరంగంగానే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఈ మధ్యం సరఫరా చేసేందుకు షాపులోనే పనిచేసే వారితో పాటు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వారి ద్వారా తమ వ్యాపారాన్ని దిన దినంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్ని పెంచి పోషించేందుకు వారికి అప్పుల రూపంలో మద్యాన్ని అందించి మరింత సొమ్మును పోగు చేసుకుంటున్నారు. గ్రామాలలో బెల్టు షాపులు ఎక్కువ కావడంతో తాగిన చోటే గొడవలకు దిగటం, అవి కక్షలకు దారితీయడమే కాకుండా, బెల్ట్ షాపులు ఇళ్ల మధ్యలో ఉండటంతో మహిళలకు బయట తిరిగే వారు కూడా చాలా ఇబ్బందిగా మారింది.


**ముందు కిరాణం షాపు పేరు లోపల మద్యం అమ్మకాలు:**

మండలం లో అనేకమంది పేరుకే కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేసుకోని, లోపల మాత్రం జోరుగా మద్యం వ్యాపారం చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు. బెల్టు షాపులు ఇండ్ల మధ్య లోనే ఉండటంతో, అర్ధ రాత్రి వేళలో మందు బాబులు ఘర్షణలు పడుతూ హంగామా చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏర్లే పారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.మహిళాలకు ఇబ్బందిగా మారింది మద్యం సేవించి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. మందుబాబులు కూడా బహిరంగానే మద్యం సేవిస్తూ, ప్రయాణికులను కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూన్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

**ఎక్సైజ్ శాఖ చర్యలు శూన్యం :**

ప్రభుత్వం నుండి అనుమతి పొందిన 5 షాపులు ఉన్నాయి. వాటి నుండి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో వున్నా బెల్టు షాపులకు తరలిస్తున్నారు. బెల్టు నిర్వహణకు ఎక్సైజ్ శాఖ ప్రోత్సాహం ఉందని కూడా పలు గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలు మత్తులో చిత్తవుతున్న నిరోధించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని, చర్యలు తీసుకోకపోవడంలో విఫలం అవుతున్నారని మండల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.

# యోగీ మోడల్ నిర్ణయాలతో సువేందు, రంగంలోకి బుల్‌డోజర్లు..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, కలకత్తా :**

పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు సమయం నుంచి కొత్త నిర్ణయాలతో ముందుకు వెళు తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నిర్ణయాలు అమలు చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం తో మార్పు ఖాయమని ఎన్నికల వేళ ప్రచారం చేసారు. ఇప్పుడు యూపీలో బీజేపీ సీఎం యోగి అమలు చేస్తున్న ఫార్ములా నే బెంగాల్ లోనూ సువేందు అమలు కొనసాగిస్తున్నారు. తాజాగా బుల్‌డోజర్లు రంగంలోకి దిగటంతో .. ఇక, యోగీ మార్క్ పాలన ఇక్కడా మొదలైందనే చర్చ వినిపిస్తోంది.పశ్చిమ బెంగాలో ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం మార్పు చూపించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లోనే పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా యూపీ సీఎం యోగి మోడల్‌ను అమలు చేస్తోంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతకు బుల్డోజర్లను రంగం లోకి దింపింది. సిలిగురిలోని అక్రమ నిర్మాణాల్ని బుల్డోజర్లతో కూల్చేస్తోంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం భారీ కార్యక్రమాన్ని చేపట్టింది. డార్జిలింగ్ ఎంపీ రాజు బిస్తా కూడా ఈ చర్యను సమర్ధించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం రెండు డజన్ల బుల్డోజర్లను యూపీ ప్రభుత్వం నుంచి బెంగాల్ ప్రభుత్వం తెప్పిస్తోందని ఆయన వెల్లడించారు. అక్రమ నిర్మాణాల అంశంపై సిలిగురిలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్య అధికారుల సమక్షంలో తీసుకోవాల్సిన చర్యల పైన సమీక్షించారు. కీలక నిర్ణయాలు చేసారు.

**యోగీ మోడల్ అమలుకు నిర్ణయం:**

ఈ ప్రాంతంలో శాంతి భద్రతల్ని పరిరక్షించడం, అక్రమ నిర్మాణాల్ని తొలగించడం, డ్రగ్స్‌ను అరికట్టడం, అక్రమ మద్యం, బార్ షాపులను తొలగించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశం అనంతరం రాజు బిస్తా మాట్లాడుతూ, సిలిగురిలో అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయని, వాటిని వదిలేది లేదని తేల్చి చెప్పారు. వీటిని కూల్చేందుకు యూపీ నుంచి బోల్డోజర్లు తెప్పిస్తున్నట్లు వెల్లడించారు. అక్రమ నిర్మాణాల విషయంలో సిలిగురి మున్సిపాలిటీ పాలకులు, అధికారులు విఫలమయ్యారని ఎంపీ విమర్శించారు. ఈ విషయంలో వారి నుంచి త్వరలోనే వివరణ కోరనున్నట్లు తెలిపారు. సిలిగురిలోని ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ఇతర జలవనరులు వంటి చోట కబ్జాల్ని పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేసారు. దీంతో.. యోగీ ఫార్ములా లే ఇక పశ్చిమ బెంగాల్ లోనూ అమలు చేస్తారనే చర్చ మొదలైంది.

# అరుదైన ప్రసవం: ఐదు రోజుల్లో నలుగురు శిశువులకు జననం.. అన్నీ సాధారణ కాన్పులే!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 15, ఉత్తరప్రదేశ్:**

ఉత్తరప్రదేశ్‌లో అత్యంత అరుదైన వైద్య అద్భుతం చోటుచేసుకుంది. ఒకే కాన్పులో నలుగురు శిశువులు జన్మించగా.. ఆశ్చర్యకరంగా ఐదు రోజుల వ్యవధిలో ఈ జననాలు జరిగాయి. హై-రిస్క్ ప్రెగ్నెన్సీ అయినప్పటికీ ఎలాంటి సిజేరియన్ (ఆపరేషన్) లేకుండా నలుగురూ సాధారణంగానే జన్మించడం విశేషం. వివరాల్లోకి వెళితే.. యూపీలోని సంభాల్ జిల్లా ఓబ్రీ గ్రామానికి చెందిన అమీనా (31) అనే మహిళ గర్భం దాల్చింది. రెండో నెలలో చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఆమె గర్భంలో నాలుగు పిండాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఇది చాలా సంక్లిష్టమైన గర్భం కావడంతో పాటు, అమీనా బీపీ, కాలేయ సమస్యలతో బాధపడటంతో పలుమార్లు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది.

**ఐదు రోజుల వ్యవధిలో ప్రసవాలు:**

ప్రసవ నొప్పులు రావడంతో మే 8న మురాదాబాద్‌లోని టీఎంయూ ఆసుపత్రిలో అమీనా చేరింది. మే 9న ఆమె ఒక మగబిడ్డకు (710 గ్రాముల బరువు) జన్మనిచ్చింది. అప్పటికి ఆమెకు ఆరున్నర–ఏడు నెలల గర్భం మాత్రమే కావడంతో, వైద్యులు చాకచక్యంగా వ్యవహరించి మిగతా ప్రసవాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఐదు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్న అమీనాకు మే 14న మళ్లీ నొప్పులు వచ్చాయి. దీంతో ఆమె మిగిలిన ముగ్గురు శిశువులకు (ఒక బాబు, ఇద్దరు పాపలు) సాధారణ పద్ధతిలో జన్మనిచ్చింది.

**తల్లి, బిడ్డలు సురక్షితం:**

సాధారణంగా ఇలాంటి హై-రిస్క్ కేసుల్లో సిజేరియన్ చేయడమే ఆనవాయితీ అని, కానీ ప్రాణాపాయం ఉన్నప్పటికీ నాలుగు సాధారణ ప్రసవాలు విజయవంతంగా జరగడం వైద్యపరంగా చాలా అరుదైన విషయమని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తల్లి,



నలుగురు బిడ్డలు సురక్షితంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. తొలి బిడ్డ తల్లి పాలు తాగుతూ నిలకడగా ఉండగా, మిగిలిన వారిలో ఒకరు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని, ఇద్దరు మాత్రం ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉన్నారని వైద్యులు పేర్కొన్నారు. ఈ అరుదైన ప్రసవాన్ని విజయవంతం చేసిన డాక్టర్ల బృందానికి పిల్లల తండ్రి, కిరాణా వ్యాపారి మహ్మద్ ఆలిమ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వెల్లుల్లి రెబ్బల పొట్టు తీసేందుకు అవస్థలు పడుతున్నారా?

లేత పసుపు రంగులో ఘాటుగా ఉండి వంటకాలకు మంచి రుచిని అందించడంలో వెల్లుల్లి ముందు ఉంటుంది. అందుకే మనం డైలీ చేసుకునే ప్రతి వంటలో వెల్లుల్లిని ఉపయోగిస్తుంటాం. ఇక నాన్‌వెజ్ వంటకాలు, ఆవకాయ వంటి పచ్చళ్లు పెట్టేందుకు ఇవి తప్పనిసరి. అయితే, ఇంతవరకు బానే ఉన్నా వాటి పొట్టు తీసే విషయంలో మాత్రం ఇబ్బందులు తప్పవు. సరిగ్గా రాక గోళ్లు పాడవుతుంటాయి. అంతేనా వెల్లుల్లి పొట్టు తీయాలంటే సమయం అంతా దానికే సరిపోతుంది. అయితే, ఇకపై ఆ అవసరం లేకుండా కొన్ని టిప్స్ పాటిస్తే చాలా సింపుల్, ఈజీగా వెల్లుల్లి పొట్టు తీయొచ్చని అంటున్నారు నిపుణులు. మరి, అవి ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.వేడి నీరు: వెల్లుల్లి రెబ్బలను ఈజీగా తీసేందుకు వేడి నీరు సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకు ముందుగా నీటిని వేడి చేసి అందులో వెల్లుల్లి వేసి పావు గంట సేపు నానబెట్టాలి. ఇలా నీటిలో నానడం వల్ల వెల్లుల్లి పొట్టు మెత్తగా అయ్యి తీసేటప్పుడు సులువుగా వచ్చేస్తుందని చెబుతున్నారు. అయితే పొట్టు తీసిన వెంటనే తడి లేకుండా తుడిచి ఆపై ఆరబెట్టి వాడుకుంటే సరిపోతుందని చెబుతున్నారు.షేక్ చేయడం: షేక్ చేసి కూడా వెల్లుల్లిపై పొట్టు ఈజీగా తీయొచ్చని చెబుతున్నారు. అందుకోసం ఓ డబ్బాలో చిన్న కాయిన్, వెల్లుల్లి రెబ్బలను వేసి వేగంగా షేక్ చేయాలంటున్నారు. ఇలా చేయడం వల్ల కలిగే ఘర్షణకు పొట్టు దానంతట అదే ఊడిపోతుందని చెబుతున్నారు. ఎక్కువ మొత్తంలో వెల్లుల్లి ఒలవడానికి ఇది ఉత్తమ మార్గమని సూచిస్తున్నారు.ఎండలో ఆరపెడితే: ఎండలో ఆరబెట్టి కూడా వెల్లుల్లి రెబ్బల పొట్టును సులువుగా తీయొచ్చని చెబుతున్నారు. అందుకోసం వెల్లుల్లి రెబ్బలకి నూనె రాసి ఎండలో ఓ గంట సేపు ఆరనివ్వాలి. ఆపై వాటిని మెత్తటి కాటన్ వస్త్రంలోకి తీసుకుని ముడివేసి, నెమ్మదిగా నేలకేసి కొడితే సరిపోతుందని పొట్టు ఈజీగా రాలిపోతుందని వివరిస్తున్నారు.మైక్రోవేవ్‌లో: బేకింగ్ కోసం ఉపయోగించే మైక్రోవేవ్‌తో వెల్లుల్లి పొట్టు తీయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి పాయలను మైక్రోవేవ్‌లో 15 నుంచి 20 సెకన్ల పాటు వేడి చేయండి. ఇలా చేయడం వల్ల లోపల ఉండే తేమ పోయి పొట్టు లూజు అవుతుంది. ఇక వాటిని బయటకు తీసి రెబ్బలను నొక్కితే పొట్టు త్వరగా వచ్చేస్తుంది.వేడి చేయడం: మీ దగ్గర మైక్రోవేవ్ లేకపోతే ఈ ట్రిక్ పనికొస్తుంది. అందుకోసం స్టవ్ ఆన్ చేసి పెనం పెట్టి వెల్లుల్లి రెబ్బలను వేసి 20 సెకన్ల పాటు సన్నని సెగపై వేయించాలి. ఆ తర్వాత పొట్టు తీస్తే పని పూర్తవుతుందని చెబుతున్నారు. ఇవి కాకుండా మార్కెట్లో వెల్లుల్లి పొట్టు తీసే పీలర్‌లూ ఉన్నాయని.. వాటిని ఉపయోగించవచ్చని చెబుతున్నారు.



# అల్టిమేట్ టేస్ట్‌తో "చింతచిగురు చేపల పులుసు"



నాన్‌వెజ్‌లో ఎన్ని వెరైటీలు ఉన్నా చేపల పులుసు పేరు చెబితే చాలు నాలుక ఉరకలేస్తుంది. ఎప్పుడెప్పుడు తిందామా అనిపిస్తుంది. అందుకే ఆదివారం వచ్చిందంటే మెజార్టీ పీపుల్ చేపలు తెచ్చుకుంటుంటారు. అయితే రెగ్యులర్‌గా ఒకటే టేస్ట్‌తో ఈ కర్రీ తినాలంటే కాస్త బోర్ కొడుతుంది. పోనీ వెరైటీగా చేద్దామంటే కర్రీ ఎక్కడ పాడవుతుందో అని అదొక టెన్షన్. ఇకపై ఆ టెన్షన్ లేకుండా మీకోసం అద్దిరిపోయే ఫిష్ రెసిపీ ఒకటి తీసుకొచ్చాం. అదే చింతచిగురు చేపల పులుసు. పులుపు, కారం రుచితో ఉండే ఈ రెసిపీని తింటుంటే ఆ ఫీల్ వేరే లెవల్. తయారు చేసుకోవడం కూడా సులువే. మరి, లేట్ చేయకుండా చింతచిగురు చేపల పులుసు ఎలా చేసుకోవాలో చూసేయండి.

**కావాల్సిన పదార్థాలు :**

**మారినేషన్ కోసం :**

చేప ముక్కలు – కేజీన్నర
ఉప్పు – 1 టీస్పూన్
పసుపు – పావు టీస్పూన్
కారం –2 టీస్పూన్లు
నూనె –1 టీస్పూన్

కర్రీ కోసం:

చింతచిగురు – ఒకటిన్నర కప్పులు
నూనె – 4 టేబుల్?స్పూన్లు
పచ్చిమిర్చి – 4
కరివేపాకు – 2 రెమ్మలు
ఉల్లిపాయ పేస్ట్ – అర కప్పు
అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు – రుచికి సరిపడా
పసుపు – పావు టీస్పూన్
కారం – 2 టీస్పూన్లు
ధనియాల పొడి – 1 టీస్పూన్
చింతపండు – 20 గ్రాములు
మెంతుల పొడి – అర టీస్పూన్
కొత్తిమీర తరుగు – కొద్దిగా

**తయారీ విధానం :**

ముందుగా చేప ముక్కలను నీటితో కడగాలి. ఆ తర్వాత రాళ్ల ఉప్పు, నిమ్మరసం కలిపి మరో రెండు సార్లు శుభ్రం చేసి జల్లి గిన్నెలో వేసి ఓ 5 నిమిషాలు పక్కన ఉంచాలి. మరో గిన్నెలోకి చింతపండు, అర కప్పు నీళ్లు పోసి నానబెట్టాలి.చేప ముక్కల్లోని నీరు పోయినాక వాటిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఆ ముక్కల్లోకి ఉప్పు, పసుపు, కారం, నూనె వేసి అంతా పట్టేలా కలుపుకోవాలి.చేప ముక్కలను మిక్స్ చేసుకున్నాక మూత పెట్టి పక్కన ఉంచాలి. ఇప్పుడు లేత చింతచిగురు తీసుకుని అందులో పుల్లలు, కాడలు, ముదురు ఆకులు లేకుండా చూసుకోవాలి.అనంతరం చిగురును చేతితో నలుపుకోవాలి. స్టవ్ ఆన్ చేసి గిన్నె పెట్టి ముప్పావు కప్పు వాటర్ పోసి మరిగించాలి.నీళ్లు బాయిల్ అవుతున్నప్పుడు చింతచిగురు వేసి లో టూ మీడియం ఫ్లేమ్‌లో 5 నిమిషాల పాటు ఉడికించాలి.చిగురు చక్కగా ఉడికినాక స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లారనివ్వాలి. చల్లారిన చింతచిగురును నీటితో సహా మిక్సీజార్‌లోకి వేసి మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసి పక్కన ఉంచాలి. నానిన చింతపండు నుంచి రసం తీసి పక్కన ఉంచాలి.స్టవ్ ఆన్ చేసి వెడల్పాటి, అడుగు మందంగా ఉన్న గిన్నె పెట్టి నూనె పోసి వేడి చేసుకోవాలి.కాగిన నూనెలో పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు వేసి వేయించాలి. ఇవి ఫ్రై అయ్యాక ఉల్లిపాయ పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కలుపుతూ వేయించాలి.ఈ పేస్ట్ చక్కగా వేగి నూనె పైకి తేలినాక ఉప్పు, పసుపు, కారం, ధనియాల పొడి లో–ఫ్లేమ్‌లో కలుపుతూ మగ్గించాలి.మసాలాలు మగ్గి నూనె పైకి తేలినాక మారినేట్ చేసిన చేప ముక్కలు వేసి మీడియం ఫ్లేమ్‌లో 5 నిమిషాలు మగ్గించాలి.ఆ తర్వాత గ్రైండ్ చేసిన చింతచిగురు పేస్ట్, చింతపండు రసం, 1 కప్పు నీళ్లు పోసి నిధానంగా మిక్స్ చేసుకోవాలి.చివరగా మెంతుల పొడి, కొత్తిమీర తరుగు వేసి కలిపి మూత పెట్టి మీడియం ఫ్లేమ్‌లో 10 నుంచి 15 నిమిషాలపాటు కుక్ చేసుకోవాలి.చేప ముక్కలు మంచిగా ఉడికి నూనె పైకి తేలినాక మరికాస్త కొత్తిమీర యాడ్ చేసి స్టవ్ ఆఫ్ చేసుకుంటే సరి. ఎంతో టేస్టీగా ఉండే చింతచిగురు చేపల పులుసు రెడీ. నచ్చితే మీరూ ట్రై చేయండి.

**చిట్కాలు:**

ఈ చేపల పులుసుకు బొచ్చె చేపలు పర్ఫెక్ట్‌గా సరిపోతాయి. ప్రస్తుతం వేసవి సీజన్ నడుస్తుండడంతో చింతచిగురు ఆకుకూరలు అమ్మే చోట, బయట సూపర్ మార్కెట్స్‌లో విరివిగా లభిస్తుంది.ముక్కలు ఉడుకుతున్నప్పుడు గరిటె పెట్టి కలిపితే చెదిరిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి, క్లాత్ సాయంతో గిన్నెను అటు ఇటూ కదుపుతూ ఉడికించాలి.చేప ముక్కలను నిమ్మరసంతో క్లీన్ చేసుకోవడం వల్ల నీచు వాసన రాకుండా ఉండటంతో పాటు టేస్ట్ కూడా అద్దిరిపోతుంది.

# బియ్యప్పిండి కాదు, రాగి పిండితో కరకరలాడే "వడియాలు"

: సమ్మర్ అంటే వడియాల టైమ్. అమ్మలైతే రకరకాల వడియాలు పెట్టి సంవత్సరంపాటు నిల్వ చేస్తుంటారు. వీటిని వేయించి పప్పు, సాంబార్, రసం వంటి వాటిల్లోకి నంజుకుని తినొచ్చు. అయితే, ఎప్పుడూ చేసే వడియాలు కాకుండా కాల్షియం పుష్కలంగా ఉండే రాగి పిండితో కూడా చేసుకోవచ్చు. సూపర్ క్రంచీగా ఉంటాయి. తయారు చేసుకోవడం కూడా సులువే. ఇక వీటిని ఒక్కసారి చేసుకుని స్టోర్ చేసుకుంటే సంవత్సరంపాటు నిల్వ ఉంటాయి. మరి, లేట్ చేయకుండా రాగి పిండి వడియాలు ఎలా చేసుకోవాలో చూసేయండి.

కావాల్సిన పదార్థాలు:


రాగి పిండి – 1 కప్పు
సగ్గుబియ్యం – పావు కప్పు
పచ్చిమిర్చి – 3
అల్లం ముక్క – చిన్నది
ఉప్పు – రుచికి సరిపడా
జీలకర్ర – అర టీస్పూన్
నువ్వులు – పావు కప్పు
ఇంగువ – అర టీస్పూన్

తయారీ విధానం :

మిక్సీజార్ లోకి సగ్గుబియ్యం తీసుకుని వీలైనంత మెత్తగా గ్రైండ్? చేసుకోవాలి.వెడల్పాటి బేషన్‌లోకి సగ్గుబియ్యం పొడి, రాగి పిండి తీసుకుని అంతా కలిసేలా మిక్స్? చేసుకోవాలి.అనంతరం రెండు కప్పుల నీటిని కొద్దికొద్దిగా పోసుకుంటూ ఉండలు లేకుండా కలుపుకుని పక్కన ఉంచాలి.మరోసారి మిక్సీజార్?లోకి పచ్చిమిర్చి తుంపలు, అల్లం ముక్కలు, కొద్దిగా ఉప్పు వేసి మరీ మెత్తగా కాస్త బరకగా గ్రైండ్ చేసుకోవాలి.స్టవ్ ఆన్ చేసి అడుగుమందంగా ఉన్న గిన్నె పెట్టి వేడి చేసుకోవాలి. కాగిన గిన్నెలోకి 9 కప్పుల వాటర్ పోసి హై–ఫ్లేమ్‌లో మరిగించాలి.వాటర్ మరుగుతున్నప్పుడు మంటను సిమ్‌లో పెట్టి రుచికి సరిపడా ఉప్పు, జీలకర్ర, నువ్వులు, గ్రైండ్ చేసిన పచ్చిమిర్చి పేస్ట్, ఇంగువ వేసి కలుపుకోవాలి.ఓ రెండు నిమిషాల తర్వాత కలిపి పెట్టుకున్న రాగి పిండిని కొద్దికొద్దిగా పోసుకుంటూ ఉండలు లేకుండా కలుపుకోవాలి.పిండిని కలుపుకున్నాక మంటను మీడియం ఫ్లేమ్‌లో పెట్టి సుమారు 10 నుంచి 12 నిమిషాల పాటు కలుపుతూ కుక్ చేసుకోవాలి. పిండి ఉడికి కాస్త దగ్గరపడినాక స్టవ్ ఆఫ్ చేసి చల్లార్చుకోవాలి.ఈలోపు కాటన్ క్లాత్ ను తడిపి నీళ్లు లేకుండా పిండి చాప మీద పరుచుకోవాలి. ఆ తర్వాత ప్రిపేర్ చేసుకున్న పిండిని గుంట గరిటెతో కొద్దికొద్దిగా పోసుకుని అప్పడాలుగా పెట్టుకోవాలి.పిండి మొత్తాన్ని వడియాలుగా పెట్టుకుని ఎండల్లో ఆరబెట్టుకోవాలి. ఇవి పూర్తిగా ఆరబెట్టుకున్నాక తీసి గాలి చొరబడని డబ్బాలో స్టోర్ చేసుకుంటే వడియాలు(అప్పడాలు) రెడీ.వీటిని వేయించడానికి స్టఎ ఆన్ చేసి కడాయి పెట్టి నూనె పోసి వేడి చేసుకోవాలి.కాగిన నూనెలో వడియాలు వేసి వేయించి ప్లేట్‌లోకి తీసుకోవాలి.

చిట్కాలు :

కాటన్ క్లాత్ లేకపోతే ప్లాస్టిక్ కవర్ మీద వేసి ఎండ బెట్టుకోవచ్చు.వడియాలను పూర్తిగా ఎండిపోయే వరకు ఆరబెట్టుకోవాలి. లేదంటే తేమ ఉంటే బూజు పట్టే ఛాన్స్ ఉంటుంది.మీరు ఉండే ప్లేస్‌లో ఎండ ఉంటే చక్కగా ఆరబెట్టుకోవచ్చు. లేదంటే ఫ్యాన్ గాలికి ఓ రెండుమూడు రోజులు ఆరబెట్టుకుంటే సరిపోతుంది.రాగి పిండి సరిగ్గా ఉడకకపోతే అప్పడాలు మధ్యలోకి విరిగిపోయే అవకాశం ఉంటుంది.ఈ వడియాల మొత్తంగా 11 కప్పుల నీరు అవసరమైంది. ఒక కప్పు రాగి పిండికి 11 కప్పుల నీరు. పిండి కలపడానికి 2 కప్పులు, ఉడికించడానికి 9 కప్పులు అవసరమవుతాయి.



# అద్దిరిపోయే "మామిడికాయ - కొబ్బరి అన్నం"

వేసవిలో నోరూరించే పండ్లలో మామిడి ముందుంటుంది. జనాలు పచ్చి కాయలతో పచ్చడి పెట్టుకుంటే.. పండ్లను నేరుగా ఆరగిస్తూ ఎంజాయ్ చేస్తారు. ఇక మరికొందరు పచ్చి మామిడితో పులిహోర వంటివి ప్రిపేర్ చేస్తారు. కానీ, పచ్చి కొబ్బరికి అడిషనల్ టేస్ట్ యాడ్ చేసి, అద్దిరిపోయే "మామిడికాయ కొబ్బరి అన్నం" తయారు చేయొచ్చని మీకు తెలుసా?...మామిడిలోని పులుపు, కొబ్బరిలోని తీపి, కమ్మదనం కలిసి ఈ రైస్ కి అద్భుతమైన రుచిని తెస్తాయి. ఇది కేవలం టేస్ట్ కోసం కొద్దిగా తయారు చేసుకునే రెసిపీ కాదు. లంచ్ బాక్స్‌లోకి పర్ఫెక్ట్ గా ఉంటుంది. జర్నీ టైమ్ లో రెగ్యులర్ పులిహోరకు బదులుగా దీన్ని ఉపయోగిస్తే ఎంతో బాగుంటుంది. మరి, ఈ సూపర్ రెసిపీని ఎలా తయారు చేయాలి? ఇందుకోసం ఎలాంటి పదార్థాలు కావాలి? అన్నది ఇప్పుడు చూద్దాం.

కావాల్సిన పదార్థాలు :

ఉడికించిన అన్నం – 2 కప్పులు (పొడిపొడిగా ఉండాలి)
పచ్చి మామిడికాయ తురుము – అర కప్పు
పచ్చి కొబ్బరి తురుము – అర కప్పు
పచ్చిమిర్చి – 4 (చీలికలు)
వేరుశనగ పప్పులు – 2 టేబుల్ స్పూన్లు
ఎండుమిర్చి – 2
కరివేపాకు – రెండు రెమ్మలు
పసుపు – అర టీస్పూన్
ఇంగువ – చిటికెడు
నూనె – 3 టేబుల్ స్పూన్లు
ఆవాలు – 1 టేబుల్ స్పూన్
జీలకర్ర – 1 టేబుల్ స్పూన్
మినపప్పు – 1 టేబుల్ స్పూన్
శనగపప్పు – 1 టేబుల్ స్పూన్
కొత్తిమీర – తగినంత
ఉప్పు – రుచికి సరిపడా



తయారీ విధానం :

ముందుగా రైస్ ప్రిపేర్ చేసుకోవాలి. దీనికి బాస్మతి రైస్ అయితే అద్దిరిపోతుంది. లేదు, సాధారణ రైస్ అయినా పర్వాలేదు.రైస్ ను మెత్తగా కాకుండా చూసుకోవాలి. పుల్లలుగా ఉంటే అంటుకోకుండా బాగుంటుంది.అన్నం వండుకున్న తర్వాత ఒక వెడల్పాటి ప్లేట్‌లో వేసుకొని చల్లార్చుకోవాలి.ఆ తర్వాత బాణాలిలో నూనె వేసి వేడి చేయాలి. హీట్ అయిన తర్వాత వేరుశనగ పప్పు వేసి దోరగా వేయించాలి.ఇప్పుడు తాలింపు గింజలు, ఎండుమిర్చి, కరివేపాకు, పచ్చిమిర్చి, ఇంగువ వేసి చిటపటలాడే వరకు వేయించాలి.తాలింపు వేగిన తర్వాత పసుపు వేసి పచ్చివాసన పోయేంత వరకు ఫ్రై చేసుకోవాలి.అనంతరం పచ్చి మామిడికాయ తురుము వేసి కనీసం ఒక నిమిషం పాటు వేయించాలి.ఆ వెంటనే పచ్చి కొబ్బరి తురుము కూడా వేసి అంతా ఒకసారి కలిపి స్టౌ ఆఫ్ చేస్తే సరిపోతుంది.ఈ మిశ్రమాన్ని చల్లారిన అన్నంలో వేసి, రుచికి సరిపడా ఉప్పు యాడ్ చేసుకొని అంతా కలిసేలా బాగా కలుపుకోవాలి.చివరగా కొత్తిమీర చల్లుకుంటే సరిపోతుంది. ఎంతో కమ్మని మామిడికాయ కొబ్బరి అన్నం సిద్ధం.ఇది ఎంతో టేస్టీగా ఉంటుంది. పిల్లల నుంచి పెద్దల వరకు చాలా ఇష్టంగా లాగిస్తారు.

చిట్కాలు :

మామిడికాయ తురుము మరీ మెత్తగా కాకుండా కొంచెం పలుకుగా ఉండేలా తురుముకుంటే అన్నం తినేటప్పుడు రుచి బాగుంటుంది.అత్తెసరుతో కుక్ చేయడం కన్నా.. గంజి వార్చితే రైస్ పుల్లలుగా ఉంటుంది

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.